శ్రీ

శమంతపంచకము.

చక్కని 5 అంకములనాటకము.

ఇందు పరశురాముఁడు క్షత్రియవీరులను 21 మార్లు సంహరించి,
శ్రీరామునిచే గర్వభంగ మొందిన కథ వివరింపబడియెను.

ప్రకటనకర్త:—

సీ. కోటీశ్వరరావు,
పబ్లిషర్ అండ్ బుక్కు సెల్లర్,
విశాఖపట్టణము

మొదటికూర్పు 1000 ప్రతులు.

విశాఖపట్టణము,
వి. యల్. పి. ప్రెస్.

 (వెల 0-10-0 అణాలు.

1923.

పీఠిక.

ఆర్యులారా!

పరశురాముని చరిత్రమును విస్తరించి నాటకరూపంబున నెవ్వరును వ్రాసియుండని కారణంబున, బ్రహ్మాండ పురాణంబుననున్న యీగాథను కొందరు మిత్రుల ప్రోత్సాహంబున దృశ్యరూపకముగా "శమంత పంచకము" అను పేరిడి ప్రచురించితిమి.

ఇంతకుబూర్వము మానాటకముల నెట్లాదరించిరో యట్లే దీనింగూడఁ దమఁగృపాదృష్టిం జూతురని నమ్ముచున్నారము.

ఇట్లు,
సీ. కోటీశ్వరరావు,
పబ్లిషరు.

విశాఖపట్టణము,
1-5-1923.

ఈనాటకమునందు వచ్చు పాత్రలు.

పురుషులు.

జమదగ్ని—ముని.

పరశురాముడు—జమదగ్ని కుమారుడు.

సుశర్మ సోమశర్మ	జమదగ్ని శిష్యులు.

శంకరుఁడు—త్రిమూర్తులలో నొకడు.

సునందుఁడు—పరశురాముని మిత్రుడు

కార్తవీర్యార్జునుఁడు—మహిష్మతీపురాధీశుడు.

చంద్రగుప్తుడు—మంత్రి.

జయంధరుఁడు—వార్తావాహుడు.

విఘ్నేశ్వరుడు—శంకరుని పుత్రుడు

విష్ణువు—భగవంతుడు.

స్త్రీలు.

పార్వతి—శంకరునిభార్య.

రేణుక—పరశురాముని తల్లి—జమదగ్నిభార్య.

శ్రీ

శమంతపంచకము.

నాంది.

సీ॥ భవ్యమచ్ఛాకృతి - వారాశిలోఁజొచ్చి
వేదముల్ గొన్న క్రి - వ్యాదుగూల్చె
తాఁబేలయౌచు మం - దరకూటమును నెత్తి
వరసుధారసము దే - వతతికిచ్చె
సౌకర్యరూపున - క్ష్మాదేవతాద్రోహి
యాకనకాక్షుని - నవలిఁగూల్చె
నరసింహరూపున - సురులెల్ల నాశ్చర్య
మందంగ భక్తుఁ బ్ర - హ్లాదుగాచె
తే గీ వామనుండౌచు దైత్యుఁడా - బలినడంచె
పరశురాముఁడై రాజుల - భంగపఱచె
రాముఁడై దశకంఠుని - రహిని జంపె
నట్టి విష్ణుండు మిమ్మోము - నరహరంబు.

(నాంద్యంతమున.)

సూత్ర—అతివిస్తరంబేల? (తెరవంకఁజూచి, పారిపార్శ్వకా! నీవొక
సారి యిటురమ్ము.

పారి—(ప్రవేశించి) ఆర్యా! ఏమి సెలవు?

సూత్ర—ఇంకను నేమి సెలవని యడుగుచుంటివా?

తే. గీ స్వాతివానగోరు చకోర - పక్షులవలె
మన ప్రదర్శనంబును గాంచ - మహిత సంత

సంబు నందుచున్నారు - సభ్యులకుగా
వీరి రంజిల్లఁజేయుట - వేడ్క గాదె?

ఇప్పుడు మనము వీరినేదేని నాటకప్రదర్శనంబున సంతోషపెట్టవలయును.

పారి—నాటకప్రదర్శనాదురంధరులగు మీకిది యొక యసాధ్యమగు కార్యమా? ఇప్పుడేనాటకంబు బ్రదర్శింపఁదలంచిరి?

సూత్ర—తే.గీ. పరశురాముఁడు ఘోరమౌ - భండనమున
గార్తవీర్యార్జునాదుల - గాసిఁజేసి
రాముచే భంగమందిన - రమ్యకథను
నాడి సభ్యుల రంజింప - నగునువునకు.

పారి—అవును. ఇది నూతనముగా వ్రాయఁబడినది.

సూత్ర—ఇంక మనమేగి యందులకువలయుఁ బాత్రంబులను సిద్ధము జేసికొందము రమ్ము.

(ఇరువురును నిష్క్రమింతురు.)

శ్రీ

శమంత పంచకము.

ప్రథమాంకము.

(ప్రదేశము—హిమవత్పర్వతప్రాంతమునఁ బరశురాముఁడు ప్రవేశము.)

పర—(తనలో) ఆహా!

సీ. కమనీయ కమలినీ - కలహంసభాసుర
విమలసరోవర - వితతితోడ
దేవార్చనాయోగ్య - దివ్య కుసుమయుత
రమణీయతరులతా - రాజితోడ
బహువిధరోగ ని - వారణ సకలౌష
ధతరులతాళి సం - తతులతోడ
మౌనీంద్రులెంతేని - మహితతపముసేయ
దగినట్టి మేలైన - స్థలముతోడ
తే. గీ. ధరణి నభముతోడను గల్పు - గిరులతోడ
మించి కనులపండువ నొన - రించుచున్న
యీ హిమాద్రి సౌందర్యంబు - నెన్నఁదరమె
ధాతకైనను వాని ము - త్తాతకైన.

ఈ హిమశైలప్రాంత భూమియంతయు డెందంబునకు మిగుల నానందంబు గలిగించుచున్నది. ఇయ్యదియే యేకాగ్రస్థితమానసుండనై పరమేశ్వరునిఁగూర్చి తపంబొనర్చుకొనుటకుఁ దగిన

రాము. (ఇంచుక యోచించి) అస్మజ్జనకుండగు జమదగ్నిము నీంద్రుని యాజ్ఞననుసరించి నాతల్లిని వధింప నామహానుభావుని కృపచేఁ గ్రమ్మర నామె పునర్జీవితయయ్యెను. అయినను మాతృహత్యాదోషంబు నాయందుఁ గలిగినది.

మ. జనకాజ్ఞన్ శిరసావహించి జననిన్ - శాతాసిచే నేను గూ
ల్చినపాపంబును వేగబాయుటకునై - శ్రీపార్వతీవల్లభున్
ఘనభక్తావనదక్షు దేవవిభుని - గాంక్షించి చేతుఁ దపం
బును మౌనీంద్రులు చెప్పినట్టిగతి స - మ్మోదైకభావంబునన్.

తే. గీ. అఖిల వేదాంతవేద్యుని - నమలచరితు
దేవదేవాదిదేవుని - దివ్యభావు
పార్వతి మనోవల్లభు - మౌనివంద్యు
చిత్తమందునిల్పి తపము - సేయువాఁడ

ఆర్తత్రాణపరాయణుండును, నిగ్రహానుగ్రహసమర్థుండును, రజతశైల నివాసుండును, భూతగణపరివృతుండును, నగు నమ్మహాదేవుండు నన్నుఁ గరుణింపక యుండునా?

మ. తన సేవారతి గాని యన్యమగు చిం - తంబూనకీభంగి నిర్
ఘనరీతిన్ దపమాచరించెడు నరున్ - గారుణ్యభావంబుతో
గనఁగా రాఁడె వరంబులీయఁడె; మహా - కల్యాణముల్ గూర్పఁడే
మనమానంద రసాబ్ధిముంచుటకునై - భావింపఁడే ధారుణిన్.

ఇంక నేను సందియంబంద నేల? అమ్మహాదేవుని గూర్చి తపంబాచరించెదఁ గాక. (కన్నులు మూసికొని ధ్యానించుచున్నాఁడు.)

(శంకరుండునుఁ బార్వతియుఁ గిరాతరూపంబులతోఁ బ్రవేశించును.)

శంక—రమణీమణీ! మనమీ హిమశైలప్రాంతభూముల రామణీయకంబునుఁ దిలకించుచు మిగుల నాలస్యముఁజేసితిమి అటు చూడుము.

మ. అదె సూర్యుండపరాద్రిఁ జేరెనన సం - ధ్యావేళ యేతెంచె; న
ల్ల దెపిచ్చేకాలయానిలంబు మదికా - హ్లాదంబునుం గూర్పఁగా
నదె పక్షుల్ ధ్వని సేయుచున్ ముదముతో - నావాసముల్ జేరె; నె
మ్మదిగా నారజితాచలంబుకిఁక భా - మా; పోదమా; చెప్పుమా.

పార్వ — మనోహరా! ఈ హిమాద్రిసొంపు నెంత తిలకించినను తనివి తీరకయున్నది. అందుచేత కాలహరణంబు సేయుచుంటిని.

శంక — అవును. ఇయ్యది నీకుఁ బుట్టినిల్లగుట నభిమానంబుచే నిట్లు బలికితివి.

తే. గీ. అత్తవారింట నెట్టిభా - గ్యంబు లమరి
యున్న; నెంతెంతి భోగంబు - లున్న; నతివ
పుట్టినిల్లు నే యెప్పుడుఁ - బొగడుచుండు
సహజమే సుమీ యియ్యది - చానలకును.

కానిచో నీవిట్లు పలుకసాహసించెదవా?

సీ. మహనీయ మాణిక్య - మరకతస్థాపిత
భవ్యసౌధాళి వి - భ్రాజితంబు
శుకశారికా శిఖి - పికకూజితమయూర
పక్షియుతోద్యాన - భాసురంబు
కలహంస సారస - కల్హారశోభిత
రమణీయకాసార - రాజితంబు
వందిజనతతి క్రై - వార సంగీత వి
విధమంగళారావ - విలసితంబు.
తే. గీ. సిద్ధచారణ గంధర్వ - సేవితంబు
సకలతాపస సందోహ - సంయుతంబు
వృషభనాయక భృంగీశ - విలసితంబు
నగుచు నొప్పు కైలాస మ - హాద్రియతివ.
అంతకంటెను నీకు నియ్యది రమణీయంబుగనున్నదా?

పార్వ—అజ్ఞానమై పలికిన పలుకునకు మన్నింపుడు. అదిగో చూడుఁడు

సీ. విరహిణీజనముల - వేఁచ బిరుదుఁదాల్చి
తనరు మన్మథుని ప - తాకమనఁగ
ప్రాచీదిశాసతీ - ఫాలతలంబున
బొల్పొందు కుంకుమ - బొట్టనంగ
నల జయంతసుతు శ - య్యాతలమునగట్ట
బన్నిన ముత్యాల - బంతియనగ
దర్పించి విరహుల - దండింపదాల్చిన
శంబరాంతకుచేతి - చక్రమనగ
తే. గీ. వరచకోరుల నోముల - ఫలమనంగ
మేటి చోరులపాలిటి - మృత్యువనఁగ
పంకజంబులపాలిటి - వైరియనఁగ
చంద్రుఁడుదయించె గాంతి ని - స్తంద్రుఁడగుచు.

కావున మనమింక నిచ్చోట నుండరాదు.

పర—(తనలో) హర! హర!! మహాదేవశంభో!!

పార్వ—(శంకరునిఁజూచి) ఓహోహా! ఎవ్వరివీపలుకులు? ఎవ్వఁడో యొక్కఁడేకాగ్రస్థితమానసుండై తపము సేయుచున్నట్లున్నాఁడు.

శంక—రమణీ! అతఁడెవ్వరోకాని నాకై ఘోరతపము సేయుచున్నాఁడు. సమీపించి యాతని యుదంతంబు నరయుదము.

పర—శంభో! కైలాసవాసా!

శంక—రమణీమణీ! ఈతపంబాచరించునది జమదగ్నికుమారుండగు పరశురాముండు. విష్ణ్వంశంబున భూతలంబున జనించినాఁడు. ఈతనివలనఁ గొంత ధరాభారము వాయఁజేసియున్నది. నాకై తపంబొనర్చునీతనికి వరంబులొసంగవలయును. ముందుగ పోని

రూపంబున నీతనిం జేరి యీతని చిత్తశుద్ధి నారయుచలయును. నే నీకిరాతరూపంబు ధరించినది యిందులకే యని తలంపుము.

పార్వ—మనోరమణా! నీవిలాసంబులు వర్ణింప నెవ్వరికిదరమగును?

తే. గీ. పెక్కు - రూపములను భక్త - వితతిమాన
సంబుల నరయుచుందువు - నరహారంబు
భవ్యభవదీయసమ్మూర్తి - మహిమ నెఱుగ
నెవ్వరికిదరమగును - నింద్రవంద్య.

శంక—తరుణీ! ఇంక నీభూసురుని చిత్తంబు గలంచెదను రమ్ము. (పరశురాముని సమీపించి) ఎవ్వరీతపము సేయువారు?

పర—(కన్నులు తెఱచిచూచి) ఎవరునీవు? నాతపంబునకు భంగము గలిగించుచుంటివి?

శంక—నేనెవ్వరినో నారూపునుబట్టి గ్రహింపలేవా?

పర—నీరూపంబును జూడగా నీవొక కిరాతునివలెఁ గన్పట్టుచున్నావు. ఏకాగ్రస్థితమానసుండనై పరమేశ్వరునిగూర్చి తపంబు సేయుచున్న నాతో నీకేమిపనియున్నది? నాతపంబునకు నీవేల భంగము గలిగించెదవు?

శంక—ఏమీ! పరమేశ్వరునిగూర్చి తపంబాచరించుచుంటివా! చాలుఁ! జాలు!!

సీ. భేతాళనివహంబు - ప్రీతిమై సేవింప
మంత్రిసందోహమై - బరగుచుండు
బ్రహ్మకపాలంబు - భైక్షుకవృత్తినిఁ
జరియింప గిన్నియై - పరలుచుండు
కాలకూటవిషంబు - కడుసారభుజియింప
భోజనంబౌచును - బొల్పెసంగు

ప్రేతభూమియె మహా - ఖ్యాతిగా విహరించు
నుద్యానవనమటంచు - నొప్పుచుండు

తే. గీ. నట్టి పరమేశుగూర్చి య - హర్నిశంబు
నిట్లు దపముసేయంగ నీ - కేల చెపుమ
వట్టి శ్రమయగుగాని స - త్ఫలము లేదు
నమ్ము నామాటలను సంక - నైననీవు.

ఇట్లు సుకుమారమైన శరీరంబు నేల గాసిల్లఁజేసెదవు?

శర— ఓయీ! నీవు వనంబులయందు మృగహింసచేయుచుఁ జరింపుచుందువు. అప్పరమేశునిఁ, గైలాసవాసుని, యోగిజనవంద్యుని మహామహిమంబు నీకేమి తెలియును?

ఉ. దేవవిభుండుమానులు జి - తేంద్రియులున్ దపముంబొనర్చియా
దేవకిరీటరత్నరుచి - దీపిత పాదసరోజుఁడౌ మహా
దేవునిఁ గాలకంధరు ను - తింపఁగ శక్తులుగాకయుండఁగా
భావనసేయుకీశరణిఁ - బల్కఁగఁజాడియె పార్వతీశ్వరుఁ.

శంక— బ్రహ్మణోత్తమా! యెవ్వరోయొక బిక్షకుని నీరీతిఁ బొగడుచు వానికై తపముసేయుచున్న నీ వివేకంబునకేమని చింతింతును?

తే. గీ. ధనముకై కుబేరుహితుఁడై - తనరియుండె
నుండుటకు తావులేకుండె - వెండికొండ
అట్టివానిని లోకేశుఁ - డంచు నెంచి
తపము నీరీతిసేయంగ - దగునె నీకు?

భూసురా! నీవు మిగుల యౌవనంబున నున్నవాడవు. అట్టిచో వివాహమాడి సుఖమందక బ్రహ్మచారివై యీ హిమాచలమున నెండకోడుచు, వానకుఁ దడియుచు, గాసినొందెద వేల? నామాట విని గృహంబునకేగి సుఖంపుము.

పర—కిరాతా! మహాదేవుని దివ్యమహిమ నెఱుఁగక యిట్లు బలికితివి. సంసారసుఖంబులయందు నాచిత్తంబును బ్రవేశపెట్టుటకిష్టములేనివాఁడనై పరమేశ్వరునిఁగూర్చి తపముసేయుచున్నాను. నీవును నింతవరకు జీవహింసఁజేసి కాలంబుఁ గడుపుచు మిగుల పాపంబు నార్జించియుంటివి. తత్పాపపరిహారార్థమై సంసారసుఖంబుల మఱచి నాయొద్దనుండి శివుని యారాధించి సుఖంబువడయుము. అట్లుకాదేని నీవిచ్చోటువాసి పొమ్ము. నీవిచ్చోటనుండుటంజేసి నాతపంబునకు భంగముగలుగుచున్నది. (ఇంచుక యూరకుండి) ఓయీ! యిటువినుము.

మ. ధరణిన్ బాపములెన్నొ చేసితివి; యీ - ద్యద్భక్తి నింపైన నీ
శ్వరపాదంబుజ మంత్రరాజము నొగిన్ - భావింపుచున్ వేగ దు
ష్కరదుర్దాంతదురంత దుస్సహమహో - గ్రగ్రాహ గంభీర సం
సరణాంభోధిఁ దరింపఁగాఁ దలఁపుము - త్సాహంబు వాటిల్లఁగన్.

శంక—ధరామరా! తాఁజెడ్డకోతి వనమెల్లనుఁ జెఱిచినట్లు నన్నుగూడఁ దపముసేయుమని చెప్పుచున్నావా? చాలు చాలు.

పర—(తనలో) వీనివచనంబులు నాకు మిగుల యద్భుతంబునుఁ గలుగఁజేయుచున్నవి. ఒకవేళ నార్తత్రాణపరాయణుండగు శంకరుండు నాచిత్తంబును బరీక్షింపఁదలంచి యిట్టిరూపమున వచ్చియుండఁడుగదా? ఆపరమాత్మునిమాయల సారము నెవ్వరికిఁ దెలియును? (ప్రకాశముగా) ఓయీ! కిరాతా! తపముజేయుచున్న నాతో నీకీసంభాషణమేల? నీదారిని నీవుపొమ్ము. నాతపంబునకంతరాయముగలిగింపకుము.

శంక—భూసురోత్తమా! నీతపంబునకు నేనంతరాయము గలిగింపుచుంటినా? ఇన్నిదినంబులనుండి తపముసేయుచుంటివి గాని పరమేశ్వరుండు నీకుఁ బ్రసన్నుఁడుగాకయుండెను. అంతకంటె నన్ను భజించినచో నీకెట్టి దుర్భేద్యమైన వరములు గావలసియున్నను నిచ్చెద.

పర—(తనలో) ఈతనివాక్యంబులుచూడ నదియొకతీరుగ నున్నవి. భక్తజనసంరక్షకుండగు పరమేశ్వరుండే నన్నుం బ్రోవందలంచి జాయాసమేతుండై యిట్టిరూపమున వచ్చియుండెనని తలంచెదను. ఈతని దేహకాంతులును, ముఖవికాసంబును జూడ మహాపుణ్యమూర్తియని తోచుచున్నది గాని నిజమైనకిరాతుడు కాడు అయినను నిట్లడిగెదగాక (ప్రకాశముగా) కిరాతశ్రేష్ఠమా! భవదీయ నివాసభూమియేది?

శంక—వెఱ్ఱివాడా! నానివాసమడుగుచుంటివా?

తే. గీ. వెండికొండయే నివసించు - చుండు తావు
సకలభువనజాలంబు సం - చారభూమి
భక్తరక్షణకార్యంబు - పరమహితము
గాగ చరియింపుచుందును - క్ష్మాసురేంద్ర.

పర—(తనలో) ఇంకను సందియమేమి? వెండికొండ యీతని నివాసభూమియట సకలలోకంబులును సంచారభూములట! భక్తరక్షణకార్యమే పరమహితమట! ఆహా! శ్రీమత్పరమేశ్వరుండే నాయెడలం గరుణాంతరంగుండై యిట్లు పార్వతీసమేతుండుగా విచ్చేసినాడు. ఇప్పుడు నేనీమహాత్మునిం బ్రసన్నునిం జేసికొందును. (శంకరుని పాదంబులపైంబడి) దేవా! నీవే కైలాసవాసుండవు:

మ॥ హరిపంకేజభవామరాళియుమునీం-ద్రాదుల్ వనాంతంబులం
స్త్రీరతింగొల్చి భవద్విలాసముల నీ - క్షింపంగ లేకుందురో
హర! నేనెంతటివాడ నీపయిన మా-యాంభోధి దాటంగ; స
త్కరుణన్ నీనిజరూపుం జూపమిక భ-క్తవ్రాత చింతామణీ.

(పార్వతీపరమేశ్వరులు నిజరూపంబులతో బ్రత్యక్షమగుదురు.)

పర—(కరంబులు మోడ్చి)

శా. ఏపుణ్యంబును జేసినానొ మరియే - యేతీర్థముల్ గాంచితో
నీపాదాంబుజ దర్శనంబు గలిగెన్ - నేడీ వనాంతంబునన్
నాపుణ్యంబు ఫలించెఁ జిత్తమున సం - తాపంబునుం బాసి నా
నా పవ్నావన గోత్రమా యిక మహో - త్మా! పార్వతీవల్లభా.

సీ. సర్వలోకాధారు - సంశ్రితమందారు
నిగమాంతసంచారు - నిర్వికారు
హాలాహలాపాను - సద్గిజనావను
బాలచంద్రకిరీటు - భక్తపోషు
రజతాచల నివాసు - గజచర్మ పరిచేలు
ఫణిరాజకేయూరు - భవవినాశు
నిర్జర వనమైత్రు - నిఖిలామరమునిజ
నస్తోత్రు సంతత - సత్యచరితు
తే. గీ. దేవదేవాది దేవుని - దివ్యభావు
సకలభువనైకగేయు మహా - ప్రసదుపాయు
త్రిపుర సంహారు సంతత - దీవిహారు
పార్వతీయుతంబుగఁ జూచు - భాగ్యమబ్బె.

(తనలో) అహో! నేటికి నాతపంబు ఫలించినది. అఖిలలోకైక మాతయగు శ్రీ పార్వతీమహాదేవితో గూడ నీమహానుభావుండు నాకుఁ బ్రసన్నుఁడయ్యెను. నేజేసిన దురితంబులన్నియు నశించినవి. (ప్రకాశముగా.)

దండకము.

శ్రీ పార్వతీచిత్తచోరా, మునీంద్రాది హృద్వీథిసంచార, శైలాసవాసాధిపా, భక్తపోషా, బుధేంద్రాది సంస్తుత్య, భృంగీశ వందీశ సంసేవితా, నీమహత్కార్యముల్ వర్ణనంజేయ నేనెంతవాఁడన్ గృపాసింధుండవై నన్ను నీకంట నొక్కింత వీక్షించినన్ మామకాభీష్టముల్ దీరవే పాతకంబెల్ల, పంచ బంగాళమై పోవదే, దేవ నాతల్లి వింధ్య దారిద్ర్యయాజ్ఞ శిరంబం

దునందాల్చి కొండాడియున్నట్టి పాపంబు బోద్రోలందీవంచు
చిత్తంబునఁ నమ్మి నీపాదపంకేరుహంబుల్ మదిన్నిల్పి యీ
రీతిరం ఘోరనిష్ఠందపంబిప్డు గావింపుచున్నాఁడ వేవేగ నన్నుం
పవే దేవ దేవాదిదేవా నమస్తేనమస్తే నమః.

(పాదంబులపైఁబడును.)

శంక—(పరశురాముని లేవనెత్తి) భూసురేంద్రా!

ఉ. నీవు మహానుభావుడవు - నిర్మల ధర్మ వివేకశీల న
ద్భావము నీదుసొమ్ము మది- భక్తి మెలంగఁ నిరంతంబునాకు సం
సేవల సేయుచుండెదవు - చిత్త మెలింగితి నీకు నిప్పుడే
యేవరముల్ గ్రహింపఁగను - నిచ్ఛజనించెను చెప్పుమిచ్చెదన్.

జనకాజ్ఞంబూని జననిని వధించిన పాతకంబు నిన్నుఁ జేరకుండును
గాక. ఇంక నీయభీష్టంబులెట్టివో తెలుపుము.

పర—దేవా! కైలాసవాసా! మహోత్కృష్టాగరిష్ఠాత్ముఁడై యనేకవేల
వత్సరంబులు తపంబాచరించినను వీక్షింపజాలని భవన్మూర్తి
గాంచు భాగ్యంబు నాకబ్బినది. నాపాతకంబు నశించినది.

ఉ. ఏవిభు పాదపద్మములు - నెన్నడు జూతుమొ యంచునెంచి స
ద్భావమునందునిల్పి నిర - తంబు జపంబును సేయుచుందురో
యావిభు నిన్నుఁ జూచితిఁ గృ - తార్థుఁడనైతిని మానసంబు మో
దావహమయ్యె నిక్కముగ - దాసజనావన యేమికోరుదున్.

అయినను, నాబ్రహ్మచర్యవ్రతంబునకు భంగము గలుగకుండను,
నిరంతరంబును నాచిత్తంబు భవత్పాదారవిందద్వయము చింతనంబు
నఁ దగిలియుండునట్లుగను వరంబు ప్రసాదింపుము.

శంక—పరశురామా! నీభక్తికి సంతసించితిని. నీయభీష్టంబులు నెఱ
వేరుఁగాక.

(తెరలో గలగలము.)

పార్వ—(శంకరునిఁ జూచి) ప్రాణేశ్వరా! ఏదియో ధ్వని వినవచ్చుచున్నది.

శంక—అదియేదియో రథధ్వనివలెనున్నది. (పరికించి) రమణీ! అయ్యది ఇంద్రుని రథంబువలెఁ గనఁబడుచున్నది. ఒకవేళ నేఁడేని కార్యార్థమై యింద్రుండు మనల నారయుచు వచ్చుచుండెనేమో? అదియేదియో చూచియే పోవుదము.

(ఇంద్రుఁడు సారథియగు మాతలితోఁ బ్రవేశించుచున్నాఁడు.)

ఇంద్రు—మాతలీ! రథంబాపుము ఇదుగో మహేశ్వరుండు పార్వతీసహితుండై యిచ్చటనున్నవాఁడు.

తే. గీ. వెలదితో నీతఁడిచ్చోట - వెలసియుంట
మనదు కోర్కె దీరుననుటంచు - మదికిఁదోఁచు
పొలతితోఁగూడి యున్నప్డు - పురుషుమనము
మిగుల సంతోషవార్ధిలో - మగఁడుగాదె.

కావున నింక సందియంబందక యీ పురాణపురుషుని దర్శింతము రమ్ము. (శంకరునిఁ జూచి ప్రకాశముగా)

మ. హర! నీవేశరణంబటంచు మదిలో - నాహ్లాదమున్ బొంది నీ
చరణాంభోజ పరాగరేణువులు శ - శ్వద్భక్తి, సర్పింపఁగా
సరగన్ వచ్చితి నిన్నుఁ జూచితిచటన్ - సంతోషమున్ గాంచెద న
త్కరుణాదృష్టిని నన్నుఁ జూచి సురలో - కంబోవ నేతెంచుమీ.

శంక—(ఇంద్రునిఁ జూచి)

సీ. కామితంబులఁదీర్చు - కామధేనువు తలఁ
పంగ నీయింటిలోఁ - బాడియావు
మూఁడులోకములచే - మ్రొక్కించుకొనఁజాలు
వరకల్పతరువు నీ - పెరటిచెట్టు

చింతామణీ రత్న - సింహాపీఠము నీకు
భాసురంబై నట్టి - యాసనంబు
మూడులోకంబుల - మోహాబ్ధిముంచు రం
భాది కాంతామణుల్ - కన్యాసతులు

తే. గీ అష్టదిక్పతులెల్ల నీ - యాజ్ఞమాళి
పైనధరియించి చరియించు - మంత్రిజనము
అట్టి నీకింత దీనత - నందనేల!
వివిధసద్గుణసాంద్ర దే - వేంద్ర చెప్పుమ.

ఇంద్రు—దేవా మహేశ్వరా! పేరునకుమాత్రము త్రిలోకాధీశ్వరుండనేగాని, నాబ్రతుకు దినదినగండము వేయిదేండ్లాయుర్దాయమన్నట్లున్నది. ఈదేహంబునకెప్పుడును సుఖంబులేదు. అనుదినంబును, నిద్రాహారంబులులేక దేవలోకంబుమీదికి దైత్యులెందు దండెత్తివత్తురోయని భీతినొందుచునేయుందును.

పార్వ—(శంకరునింజూచి) నాథా! సురలోకముమీదికేయసురవరులైన దండెత్తివచ్చిరికాబోలు! (ఇంద్రునింజూచి) మహేంద్రా!

తే.గీ. అలపులోమునిగాదిలి - యాత్మజాత
సాధ్వి నీదు దేవేరిక - శలమె; సత్కు
మారుడాజయంతాఖ్యుండు - భద్రమెకద
వినంగ సంతసంబయ్యెను - వేగఁజెపుమ.

ఇంద్రు—చతుర్దశభువనమాతా! ఏమనిచెప్పుదును.

తే. గీ కొండగుహలందు సుఖముగా - నుండెయువిద
యామెంగాచుచునుండె జ - యంతు; దుష్ట
దిక్పతుల జూడ లోక్కింత - దెలియరావు
నేనువచ్చితి నీరీతి - నిన్నుగాంచ.

పార్వ—ఎంతకష్ట మెంతకష్టము!

శంక—విబుధేశ్వరా! నాకలోకముమీదికి దండెత్తివచ్చిన యాదైత్యులంత దారుణకృత్యంబుల నాచరించిరా!

ఇంద్రు—పరమేశ్వరా! అదుష్టదానవుల దారుణకృత్యంబులను వర్ణించుటకు నాకుజిహ్వయందు బదములు చాలకయున్నవి.

సీ. చింతామణిగణ్ని - సింహాసనంబును
ధ్వంసంబుగావించి - తఱిరినారు
నందనోద్యానమా - నందమందుచు జొచ్చి
చెట్లనెల్లను బాడుc - జేసినారు
కామితంబులనిచ్చు - కామధేనువును బం
ధించుచు బాధల - ముంచినారు
మందాకినీనది - యందున రక్తంబు
గలిపి నీరంబుల - గలంచినారు

తే. గీ. అమరవేశ్యలదఱిమి క్రౌ - ర్యంబుతోడ
నుచితంబుగ బాధింప - నెంచినారు
చేయవలసినదంతము - జేసినారు
విడువవలసినదేమియు - విడువలేదు.

ఇంక రణరంగంబున,

తే. గీ. అఖల జనులకు మృత్యువై - యలరునట్టి
కాలుడోడ తక్కుగలది - కృతులమాట
జెప్పనేల; రణమువీడి - శీఘ్రగతిని
బ్రాణములు దాచుకొనుటకై - పాఱినారు.

దేవా! ఇంకc బలుమాటలేల.

శా. వాలాయంబుగ నన్ను గాచునను చూ - భావంబులో నమ్మి నీ
పాలజేరితినయ్య యిప్పుడుc గృపా - పాథోనిధీ దీనిధీ
పాలన్నుంచిన నీటముంచిన నరే - భావంబునీదౌట; నా
కేలా వేరొకచింతc జెందగను లో - కేశా! యుమానాయకా.

పార్వ—మహేంద్రా!

తే. గీ. చేటుకాలమాసన్నమై - చెడుగుపనుల
జేయుచున్నారు దానవుల్ - క్షితితలమున
నింక వారు మడియుదురు - శంక లేదు
చింతవీడుము నీదగు - స్వాంతమందు.

శంక—దేవనాథా! పరితాపంబుడుగుము. (పరశురాముని జూపి) ఈభూసురోత్తముండెవ్వరో యెఱుంగుదువా? జమదగ్ని మునీంద్రుని సుతుండగు పరశురాముండు. నాకై మిగుల ఘోరతపంబు జేసినాడు.

మహేం—(పరశురామునిఁ జూచి) సుగుణధామా పరశురామా! భూసురోత్తముండవైన నీదర్శనంబున నేను ధన్యుండనైతిని.

పర—మహేంద్రా! పరమేశ్వరునికటాక్షంబున త్రిభువనసామ్రాజ్య నాథుండవైన నిన్నుఁ జూడఁగలిగినందులకే నానందంబందుచుంటి.

శంక—(పరశురామునితో) పరశురామా! ఈదేవకార్యంబు నీవలన నెఱవేరవలసియున్నది.

పర—దేవా! అల్పుఁడనగు నాచేఁ జేయఁబడవలసిన కార్యమెట్టిదో సెలవీయఁగోరెద.

శంక—నీవీమహేంద్రునివెంట నరిగి దేవలోకము నాక్రమించుకొనిన యామ్రుక్కడిరక్కసులనుక్కడగించి దేవతలఁగాపాడవలయును.

పర—దేవా! నామనంబు శోధించుటకిట్లడగితివని తలంచెదను.

మ. ధరణీదేవకులంబునంబొడమి శా - స్త్రజ్ఞానముంగాంచి; సొం
పరయన్ నీకయి ఘోరవ్రతతపము సే - యంగల్గితింగాని; సం
గరరంగంబు నెఱుంగనెప్పుడు ధనుః - పాండిత్యమా లేదు; యే
కరణిన్ దానవులన్ వధింపగను శ - క్యంబౌను లోకేశ్వరా.

శంక—పరశురామా! దీనింగూర్చి నీవావంతయు స్వాంతంబున సంశయింపఁబనిలేదు. సమస్తశస్త్రాస్త్రంబులును, నీకొసంగి వాటిని బ్రయోగించువిధంబునీకుపదేశించెద. ఇదిగో! ఇయ్యది పరశువు. ఇదియే నీకు శత్రులనుజంపుటకు ముఖ్యమైన పరికరము. ఇదిగో! ఈయస్త్రంబు నీనామంబునఁ దనరఁగలదు. (శస్త్రంబు లొసంగును.)

పర—

సీ. నేడుగా నాపాప - నిచయంబు బా
సెడి మార్గంబుగంటిని - మహితచరిత
నేడుగా నాదేహ - మీడులేనట్టి దై
వల్యమందుటయు మా - ప్రాణనాథ
నేడుగా జమదగ్ని - నేర్పిన సద్విద్య
పావనత్వముగాంచె - భవ్యతేజ
నేడుగా నాతల్లి - నిజమైన వీరమా
తయగుచుఁజెలగుట - ధన్యమూర్తి.
తే. గీ. నేడుగా నిన్నుగొల్చుటన్ - నిక్కమైన
ఫలము నందంగ గంటిని - భక్తపోష
నేడుగా లోకముల నెల్ల - వాడలందు
ఘనయశంబునుగొంటిని - గరళకంఠ.

దేవా! అనేకవేల వత్సరంబులు సాధనంబుజేసినను దుర్లభంబైన శరవిద్యనంతయు నిమేషకాలంబులో నాకొసంగితివి. భక్తప్రాణపాలకుండవగు నీవు తలంచిన యేకార్యము సేయఁజాలవు? (ఇంద్రునిఁజూచి.)

మ. బలిచెంతన్ వసియింపఁగాఁదలఁచి నూ - పాతాళంబులోదూరినన్
జలధిం జొచ్చిన నేరికిం దెలియకా - శైలంబులో దాగినన్
బలిమిన్ దానవులన్ వధింతు భువన - ప్రఖ్యాతిగా నీశును
జ్వాలకారుణ్యము నూతగాఁగొనుచు దే - వానీశ వీక్షింపుమా.

(శంకరునిఁజూచి) దేవా! భవదీయాజ్ఞ మౌళిం ధరించి దానవుల వధించి మహేంద్రునకు మోదంబుగూర్చెదగాక. అనుజ్ఞ నొసంగుము.

శంక—భూసురమణీ! పోయిరమ్ము.

తే. గీ. అసుర వైరులనెల్లర - నాహవమున
నిజకుఠార ధారాహతి - నేలగూల్చి
యమల యశమంది వెలుఁగుమీ - యవనియందు
భవ్యగుణధామ! జితకామ! - పరశురామ!!

ఇంద్రు—భవదీయామోఘాశీర్వచనంబు ఫలించుగాక. దేవా! ఇంక మేమేగెదము. (పరశురామునితో నిష్క్రమించును.)

పార్వ—మనోహరా! మీచర్యలన్నియు జిత్రములు. ఈభూసురున కస్త్రవిద్య నుపదేశించి రణంబునకుఁ బంపితిరేమి?

శంక—

తే. గీ. ధరణిభారము వాపగా - సురలు వేడ
జలజనాభుని కిరమునఁ - జక్రమిట్లు
పరశురామాకృతిని దాల్చి - మహినిబుట్టె
దెల్పితిని యిప్పుడైనను - లలనమిన్న!

ఆసంగతియంతయు నెమ్మదిగాఁ జెప్పెదను రమ్ము.

(నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

శమంతపంచకము.

ద్వితీయాంకము.

(జమదగ్న్యాశ్రమము:— సుశర్మ—సోమశర్మయను మునిబాలురు చెరియొకప్రక్కనుండి ప్రవేశించుచున్నారు.)

సుశ—సోమశర్మా! మాట, మాట. ఎక్కడికింతతొందరగాఁ బరుగెత్తుకొనిపోవుచున్నావు?

సోమ—మిత్రమా! వన్నాపకము. మాహిష్మతీపురాధీశ్వరుండగు కార్తవీర్యార్జునుండు చతురంగబలసమేతంబుగా వేటకరుదెంచి మనగురుండగు జమదగ్నిమునీంద్రుని దర్శింపఁదలంచి రాఁగా మనగురుండారాజునకు నాతిథ్యంబు నొసంగుదును గావున నేఁటికి యుండుమని కోరెను.

సుశ—అందులకారాజు సమ్మతించెనా?

సోమ—అందులకారాజు మునీంద్రునిఁ జూచి "నీవరణ్యంబునఁ దపోవృత్తినున్న తాపసివి. నేననేకవేల సైన్యంబులతో నరుదెంచితిని. మాకాతిథ్యంబునొసంగుట నీకుఁ గష్టము గావున మన్నించి నన్ను మాపురంబునకు బోనిమ్మని" వచించెను.

సుశ—అందులకు మనగురుండేమనిపలికెను?

సోమ— మనగురుండు భూపాలునిఁజూచి "భూపురంధరా! నేను తపోవృత్తినుంటిననియు, నీకాతిథ్యంబు నొసంగజాలననియు, దలంచకుఁడు. ఎంతమందివచ్చినను బంచభక్ష్య పరమాన్నంబులతో భోజనంబు సమకూర్పజాలిన సామర్థ్యము నాయొద్దనున్నది. సందియంబందవల"దని పలికి యాతనిని సమ్మతింపఁజేసెను. ఇప్పుడు వారికందరికిని మనగురుండు విందుఁగుడుపుచున్నాఁడు.

సుశ— గురుపుత్రుండగు పరశురాముండు తపంబుఁదీరిచి వచ్చెనా!

సోమ— మరలివచ్చి నేటికి మూఁడుదినంబులైనది. తపమునుండి యాతఁడు మరలివచ్చినతరువాత యాతనితేజము దుర్నిరీక్ష్యమైయున్నది. పరమేశ్వరుని కటాక్షంబున నస్త్రవిద్యనార్జించి దేవలోకంబునకేగి దానిపై దండెత్తివచ్చిన రాక్షసానీకంబును బాఱద్రోలి దేవతలనుద్ధరించి, సునందుఁడను మిత్రునితో నాశ్రమంబున కరుదెంచెను.

సుశ— సునందుఁడెవరు!

సోమ— పరశురాముండు దేవలోకంబునుండి మరలి వచ్చునప్పుడు సునందుని నొకవ్యాఘ్రంబు దఱుముచుండఁగా మన పరశురాముండు బాణంగూర్చి యాతనిం గాపాడెనట. అప్పటినుండియు నాతడు మనగురుపుత్రునికి మిత్రుఁడై యాతని నెడబాయక యుండెనఁట.

సుశ— ఇంత ఘనమేగి మునీంద్రుండు రాజేంద్రునకొసంగు నాతిథ్యంబును జూతమురమ్ము. (ఇరువురును నిష్క్రమించుచున్నారు.)

(కార్తవీర్యార్జునుఁడు-మంత్రియగు చంద్రగుప్తుఁడు-ప్రవేశము.)

కార్త.— మంత్రివర్యా! ఈజమదగ్నిమునీంద్రుని ప్రభావంబున కెంతయు నాశ్చర్యమునందఁ గలిగియున్నది. ఏలయనిన,

మ. మానమిచ్చోట వసింప రత్నమయ మహా-ప్రాసాదముల్ జేసె పే
ల్వాని నిర్మించెను సర్వసంతతికి శా-లల్ గూర్చె; స్నానంబుకై
ఘనతోయంబులతో సరోవరములన్ - గల్పించె నేర్పొప్ప; స
ఖ్యున్నిదివ్యంబగు సత్ప్రభావమున రున్ - మోదంబు పుట్టింగదా.

ఇదియట్లుండ,

తే. గీ. వివిధ భక్ష్యంబులను గూర్చి - వేడ్క మీఱ
నెవరి కేరీతి వలయునో - యొసంగి సకల
సైన్యమునకు గూర్చెను విందు - నస్మునీంద్రు
తపము మెచ్చంగవచ్చును - ధరణియందు.

చంద్ర— దేవా! ఇదియంతయు మునీంద్రుని తపఃప్రభావంబని తలం
పుచుండిరి కాబోలు! అట్లు గాదు. ఇదియంతయుం జేసినది యా
తనియొద్దనున్న కామధేనువే.

కార్త— అట్లనా? మునీంద్రుని తపోమహాత్త్యంబున నిదియంతయు
సమకూరెనని తలంచితిని. దీనికి కారణంబా సురభియా?

తే. గీ. పరమాభీష్టము గోరిన - నింతలోన
నిరిగి సమకూర్పజాలిన - సురభి గలిగి
వెలయుట మునీంద్రు తొలితపః - ఫలము గాదె?
సందియంబేల దీనికిం - జంద్రగుప్త.

చంద్ర— మహారాజా!

మ. తురగస్యందన మత్త సామజభట - స్తోమాది దివ్యాంబరా
భరణామూల్య సువస్తుసంచయములున్ - ప్రాసాద సౌధంబులున్
వరరాష్ట్రంబులు నేటికిన్ సురభి యం - పాదించినం జాలదే
ధరణీపాలకులాబ్ధిచంద్రమ! దిగం - తఖ్యాతిం జేబట్టగన్.

దేవర వారికెంత భాగ్యంబుండినను నా సురభితో సమానంబగునా?
కావున మనమెట్లైన దానిని సంపాదింపవలయును.

కార్త — నీవు వక్కాణించినమాట నిశ్చయమే కాని,

ఉ. ఎండకువానకోర్చి పర - మేశునిగూర్చి హిమాచలంబునం
దండితపంబుఁ జేయు ఘన - తాపసవర్యులు కామధేనువుం
బొందుగఁ గాంచగందురను - మీ మదిలోఁ దలపోసిచూడ భూ
ఖండలనాథులే కరణి - గాంచఁగ నేర్తురు దానిఁ జెప్పుమా.

మనబోంట్ల కద్దానినార్జించుట సాధ్యంబగునా?

చంద్ర—

మ. ధరణీపాలకులాబ్ధిచంద్రుఁడవు ద - త్తాత్రేయప్రాసాద స
ద్వర బాహాబలశౌర్యమూర్తివి రిపు - ధ్వాంతోగ్రభానుండవో
నరనాథాగ్రణి దీనికింత మదిలో - నంజింతనీ కేల; స
త్వరగాఁ నానతినీయుమా సురభినిం - దథ్యంబు గాఁ దెచ్చెదన్.

దేవా! నీకు దుస్సాధ్యంబైనది యీజగంబున లేదు. నీవిప్పుడాజ్ఞ నిమ్ము. నేనాసురభిం దెచ్చి నీముందుఁ బెట్టెద. ఇందులకు సందియంబావంతయును లేదు. నావాక్యంబులను సంపూర్తిగ నమ్ముము.

కార్త — చంద్రగుప్తా! మనకు సాధ్యముగాని కార్యమును జేసెదనని పలుకుచుంటివి. నీవాసురభి నెట్లు దోడ్కొని రాగలవు?

చంద్ర — అయ్యా! సందియంబంద వలదు. నేనాజమదగ్ని మునీంద్రుని సన్నిధికేగి, వినయపూర్వకముగాఁ గామధేనువును మారాజున కర్పింపుమని యడిగెదను.

కార్త — అతండందులకు సమ్మతించునా?

చంద్ర — సమ్మతింపకపోయినచో నాసురభికి బదులుగా సహస్రవేల గోవులును, వలసినంత ధనంబును నొసంగెదనని చెప్పెదను.

కార్త — మంత్రీ! ఏమియూవెర్రి? అందులకాతండు సమ్మతింపకపోయినచో నేమి చేసెదవు!

చంద్ర—

కం. అదలించెద బెదరించెద
మదమడఁచెద భీతిఁగొల్పి - బలవంతముగన్
ముదముఁ దెచ్చెద సురభిని
సదమలచరితా యనుజ్ఞ - చయ్యననిమ్మా.

కార్త—మంత్రీ! నావాక్యంబులు నాకర్ణానిపై నాసఁబుట్టింపుచున్నవి కానిమ్ము. ప్రయత్నించిచూడుము. నేనేగెద. (నిష్క్రమించును.)

చంద్ర—(తనలో) భూవల్లభునితో నెట్లయినఁ గామధేనువునుఁ దెచ్చెదనని పలికితిని. ఇప్పుడు పరశురాముండాశ్రమంబున లేడు. కావున జమదగ్నిం జేరి గోవునిమ్మని యడుగుటకిదియే మంచిసమయము. (ఇంచుకనడచి) అడుగో! జమదగ్ని యొంటరిగనే యున్నవాడు. (తెర లేచును.)

(జమదగ్ని ప్రవేశము.)

జమ—(తనలో) ఏమిది! కార్తవీర్యార్జునుని మంత్రియగు చంద్రగుప్తుండు మరల వచ్చుచున్నాడేమి కారణమో!

చంద—(జమదగ్నిని సమీపించి) మునీంద్రా! భవదీయ పాదారవిందములకిదే నమస్కరింపుచున్నాను.

జమ—అభీష్టావాప్తిరస్తు. మంత్రికులావతంసమా! నీవు మరల నేదియో కార్యముపై వచ్చినట్లు తోచుచున్నది.

చంద్ర—ఋషివర్యా! నారాకకుఁ గారణంబు నీవెఱింగియుండినను నాచే వినఁదలంచి యడుగుచుంటివి.

తే. గీ. వరయభీష్టంబులను గూర్చు - సురభి నీదు
యాశ్రమంబుననుండుట - యవనిధవుఁడు
గాంచి దానిపై నాసవ - హించి నీదు
యాసతిసెఁ గొనితెమ్మంచు - నంపె నన్ను.

మా రాజేంద్రుని సంగతియంతయు నీకుఁ దెలిపియేయున్నది. అతఁడు కామధేనువును దనకొసంగుమని కోరినదే చాలును. అతఁడే స్వయముగా నీకడకరుదెంచి యడుగఁదలంచెను గాని, నేనతని నివారించి, యాతనికి మారుగా నేనువచ్చితిని. కావున మాయందుఁ గృపాంతరంగుండవై యా కామధేనువును మాకర్పింపుము.

జమ—(తనలో) ఆహా! పిరికాతిథ్యంబునొసంగుట పామునకుఁ బాలుపోసినవిధంబయ్యెనుగదా! తాపసవాటికయందున్న కామధేనువును గోరుటకు వీరిచిత్తంబెట్లు సమ్మతించెనోగదా! (ప్రకాశముగా) చంద్రగుప్తా!

మ. వర సంసారసుఖంబులన్ మఱచి శుం - భల్లీల లక్ష్మీమనో
హారపాదాంబుజముల్ నిరంతరమునున్ - ధ్యానింపుచున్ గానలన్
బరమామోదములోఁ గాలమరయన్ - దాటించు నీసన్మునీ
శ్వరవాటంబున నుండునట్టి సురభిన్ - వాంఛింపగాఁబాడియే!

మహాసంపన్నుఁడైన మీరాజాగ్రణికిసురభితో నేమిపనియున్నది? అతనియొద్దనున్న భాగ్యములకంటె నిది యెక్కువదియా!

చంద్ర—మునివర్యా! ఎక్కువతక్కువల కేమి? నీయొద్దనున్న సురభిని నా యతనియొద్ద నుంచుకొనుటయందుఁ గుతూహలముగలిగియున్నవాఁడు. నీకుఁ దీనికిబదులుగా సహస్రవేల గోవులును వలసినంత ధనమును నొసంగెదము. దీనిని మాకొసంగుము.

జమ—మంత్రీ!

తే. గీ. అడవులందుఁ దపోవృత్తి - నలరుచున్న
జోగులకు నేల గోవులు - భోగమేల?
యేల భాగ్యంబు సంపద - లేల; మీకె
చెల్లు నుంచుకొనఁగ నివి - క్షితితలమున.

మాకీ కామధేనువు యొక్కటియున్న చాలును. మాయాశ్రమంబున నిది యుండితీరవలయును. అదియుంగాక మావద్దనే యుండి వశీయించును గాని వేరొండుస్థలమున నుండదు. కావున దీనిపై నాశవహింపవలదని మీరాజేంద్రునకుఁ జెప్పుము.

చంద్ర—తాపసోత్తమా! దత్తాత్రేయ వరప్రసాదలబ్ధమహాబలపరాక్రమసంపన్నుఁడగు కార్తవీర్యుని యభీష్టంబు నెఱవేర్పకుండుట నీకుఁదగదు. అతని సామర్థ్యము నీవెఱిఁగియేయుంటివి.

జమ—అడుగఁగూడనివస్తువు నడిగినచో నేనేమనఁగలను? ఈకామధేనువునుగోరుట కెవ్వరిచిత్తంబయినను సమ్మతించునా! తెలిసియో తెలియకనో మీరాజు నిన్నుఁబంపెను. నీవడిగితివి. ఇయ్యది నేఁ దనికొసంగఁజాలకుందులకు మిగుల విచారింపుచున్నాను.

తే. గీ. విపుల తపమునుగావించి - వెలసినట్టి
మానితర్యులకిద్ది సం - ప్రాప్తమగును
గాని; సామాన్యజనులకుఁ - గాదటంచు
జెప్పినానంచు మీరాజుతోఁ - జెప్పుమయ్య.

అయ్యా! నీవింక నేగుము

చంద్ర—(తనలో) ఈతఁడు మంచిమాటలతో సురభినిచ్చునట్లు గనిపించదు. ఇంచుక బెదరించెదగాక. (ప్రకాశముగా) మునిచంద్రా! కార్తవీర్యార్జునుని యభీష్టముదీర్చుట నీకుచితమైన కార్యమని నేనింతకుపూర్వమే చెప్పియుంటిని. నీవట్లు గావింపవేని యతం డెట్లయినను గోవును దీసికొనిపోవకమానఁడు. అప్పుడు నీవు విచారించినందువలనఁ బ్రయోజనముండదు.

జమ—(తనలో) ఈతడు నేను గోవు నొసంగకపోయినను బలవంతముగనైన గొనిపోవుదుమని సూచింపుచున్నాడు. (ప్రకాశముగా) మంత్రివర్యా! గోవును నొసంగుటకు నేనంగీకారము సూచించితిని.

అట్టిచోఁ దాపసాశ్రమంబుననున్న దానిని మీరు గొనిపోవుట కెట్లు సమర్థులగుదురు!

చంద్ర—బలముచేత,

జమ—మాతపోబలముకంటె మీబలంబెక్కువయని తలంచితిరా!

చంద్ర—నిస్సంశయముగ.

జమ—ఓహో! మీరాజంతటి ధర్మపరుఁడా!

క వి రా జ వి రా జి త ము.

వనమునవేఁటకు వచ్చినవాఁడని - భవ్యముదంబునఁ బిల్చితిగా
ఘనముగ విందునుగూర్చితి వానికి - గాంక్షతో సైన్యసమేతముగా
మనమున నీగతి సేయుదునంచును - భావన సేయఁగ నైతినిగా
జనపతిచిత్తము నిప్పుడు దెల్పఁగ - సంతసమేర్పడ వింటినిగా.

మీరాజేంద్రునికి తాపసోత్తములపైఁ జూపించుట కేకాబోలు దత్తాత్రేయుండను గ్రహించియున్నాడు! అట్లైన, మీరాజేంద్రునితో,

తే. గీ. సురభిపై నాసఁబూనుచు - వరలకనుము
తాపసులపైన శౌర్యంబు - జూపకనుము
మంచిచెడ్డలు దెలిసి వ - ర్తించుమనుము
పృథ్వినాథునికదకింక - వేగఁజనుము.

చంద్ర—మునివర్యా! నేనింక రాజసన్నిధికి గామధేనువుతోడనే పోవలయును గాని యుచితహస్తంబులతో బోరాదు. ఎట్లైనను దానిం దోడ్కొనిపోవుటకుండుఁ గృతనిశ్చయుండనై వచ్చితిని. నాకు క్రమముగలిగింపకుండ నొసంగితివేని యెంతైనను సంతసించెదను. లేదేని బలవంతముగనైనను దీసికొనిపోవుదును.

జమ—(కోపముతో) అవురా! ఏమి! ఈదురాగతము

తే. గీ. అస్మదీయ తపోశక్తి - నరయకుండ
యాశ్రమంబున ధేనువు - నవనినాథు
కడకుఁ జేర్పగాఁ దలపోసి - కాంతి తోడ
వచ్చియున్నాడవా నీవు - పాపచరిత.

రాజేంద్రుండుక దాయని తలంచి యాతిథ్యంబు నిచ్చినందుకిది యాఫలంబు? ఔరా! దత్తాత్రేయ వరప్రసాదలబ్ధమహాబలపరాక్రమ విక్రమ ధనరాజ్యసంపన్నుఁడై కన్నును మిన్నునుఁగానక మీరాజు చరింపుచుండెనా? (ఇంచుక యాగకుండి) ఈమాటలతో నేమిప్రయోజనంబున్నది! నాదేహంబునఁ బ్రాణంబులుండగా గోలనీయను. సౌమ్యా.

చంద్ర—మునివర్యా! నీవు సామవాక్యంబులతో ధేనువీయవా?

జమ—ముమ్మాటికిని నీయను.

చంద్ర—తాపసేంద్రా! నీకుఁ బ్రాణంబులపై నాస లేదా?

జమ—(కోపముతో)

తే. గీ. సాధులైన తాపసుల యా - శ్రమధనంబు
నపహరించుటకే నిన్ను - నజుఁడు జన్మ
మందజేసెనుగాబోలు - నవనియందు
గాకయుండిన నిట్లు బ - ల్కంగగలవె.

ఓరీ! నీచమతీ! మీరు సుగుణాఢ్యులని నాయాశ్రమంబున నడుగు పెట్టనిచ్చితిని లేకున్నచో మాపరశురామునితోఁ జెప్పియుంటినేని నిన్నును మీరాజును భస్మము జేసియుండఁడా?

చంద్ర—(తనలో) ఈతనితో నేను వృథా కలహంబుఁ బెంచుకొనుటవలనఁ బ్రయోజనము లేదు. కావున నేను నెరవేర్చుకొనెద (ప్రకాశముగా) తాపసేంద్రా! నీతో నేను కలహించుటకరుదెంచ

లేదు. సురభి నిమిత్తమరుదెంచితిని. నా కార్యము నేను జేసికొందును. (ప్రక్కం జూచి) భటులారా! ఆగోవును బంధించుకొని పోవుదము రండు.

(నలుగురు భటులు ప్రవేశించి గోవును బంధింతురు.)

జమ—(కోపముతో గోవునకడ్డమునిల్చి) ఓరీ! దురాత్ములారా! ముందు వెనుకలారయక తాపసవాటికయందున్న గోవును బంధించుకొని పోవనెంచుచున్నారా? ఓరీ! దుర్మదాంధా! చంద్రగుప్తా! ఎంత సాహసకృత్యంబు సేయనెంచితివిరా! బలాత్కారంబుగ గోవును గొనిపోవనెంచితివా? ఏమిరా! నీప్రతాపంబు తాపసులపైం జూపించుచుంటివా?

ఉ. ఎంతటి నీచకృత్యమును - నిట్టులు సేయఁగ నెంచినావు కా
వంతయు భీతిలేక నిపు - డాత్మజుఁడిచ్చట నుండెనేని దు
ర్దాంత పరాక్రమక్రమ వి - రాజితశౌర్యముతోడ దాకి మీ
యంతము జూచితీరును గ - దా! యవనీంద్రుడు శోకమందఁగన్.

నాసుతుండగు పరశురాముండిచ్చట లేకుండుటచే బ్రతికిపోయితిరి. అయినను మీరీధేనువు నెట్లు గొనిపోవుదురో చూచెదగాక.

(భటులు గోవును బంధించి గొనిపోవుచుండగా నడ్డుపడుచున్నారు.)

చంద్ర—(జమదగ్నిం బట్టుకొని లాగుచు) తాపసా! సామదానవాక్యంబులచే నెంతప్రార్థించినను, గోవును నీయకపోవుటచే నిట్లు సేయవలసివచ్చినది. ఇప్పుడైనను దీనిని విడిచిపుచ్చితివేని నీతెరువునకు మేము రాము.

జమ—ఛీ! తుచ్ఛుఁడా. నాకంఠంబునఁ బ్రాణంబులున్నంతవఱకును నేను దీనిని విడువఁజాలను. ఓరీ నీచాత్మా అటుఁజూడుము. ఆధేనువు కన్నులవెంట నెట్లు నీళ్లు విడుచుచున్నదో. ఒక్కొక్క చుక్క తరతరంబులును మీవంశంబు దహించితీరును.

(గోవునుం జూచి)

మ. కనులన్నీరము కాల్వలై చన బిగం - గా నిట్లు నాదిక్కు వం
గనుచుం జన్విడిపింపుమాయనుచుం గే - కల్ బెట్టగా జెల్లునే
నినుబంధించిన యాదురాత్మకులనుం - జెండాడు శౌర్యంబు నా
కును లేనందుకు జింతనొందెద మదిం - గోమూర్తి దేవోత్తమా.

చంద్ర—(జమదగ్నిం ద్రోసివేయుచు) నీవు దీనితెరువునకు రావలదు. అట్లు వచ్చితివేని ప్రాణంబులు దక్కవు.

జమ—ఓరీ దుష్టాత్మా! ఏమిరా! నీకెంత కావరము. నేనడ్డమువచ్చితినేని నన్నుఁజంపి యీధేనువును దీసికొనిపోవుదువా! ఎంతసాహస మెంతసాహసము మా పరశురాముండు వచ్చువరకును నిలచుక తాళుము. నీశౌర్యము గనుఁబడును.

చంద్ర—(తనలో) ఇంక నీముని గోవునువీడడు. నేనిట్లు వాగ్వాదంబును బెంచుకొనుచుఁ గాలయాపనంబు జేసినందువలనఁ బ్రయోజనము లేదు. ఇతనిని వధించియే గోవును తీసికొనిపోవుదును.

(మునినిజూచి)

మ. బలవంతంబుగనైన దీని గొనిపో - వఁ జిత్తమందెంచి భూ
తలనాథాగ్రణి పంపవచ్చితిని మో - దంబారగా నిన్ను ని
శ్చలచిత్తంబున ధేనువీయుమని నా - సర్గ గోర; నాపై మహో
జ్వల కోపంబును జూప నీకరణి సం - ప్రాప్తించె మౌనీశ్వరా.

ఇప్పుడైనను గోవునిమ్ము. మాదారిని మేమేగెదము.

జమ—నేను బ్రతికియుండఁగా గోవునీయను. (బిగ్గఱగా నలుదిక్కులు గలయంజూచి) హా! తనూభవా పరశురామా ఈదురాత్ముండగు చంద్రగుప్తుండు కార్తవీర్యార్జునునిపంపున మనయాశ్రమంబునకు వచ్చి కామధేనువును బంధించుకొనిపోవుచు నన్ను హింసింపుచున్నాఁడు. సత్వరమ్ముగవచ్చి నన్ను వీనిబారినుండి రక్షించి గోవును విడిపింపుము.

చంద్ర—(తనలో) ఒకవేళ నీతని కేకలువిని పరశురాముఁడు వచ్చినచో మోసముసంభవింపఁగలదు. ఇంక నేను తొందరపడవలెను. (ప్రకాశముగా) మునీశ్వరా! ఏమీ? పరశురాముండువచ్చి నిన్ను రక్షించునా? (ఖడ్గంబు జమదగ్నిపై విసరి గోవుతో నిష్క్రమించును.)

జమ—హా! (నేలఁబడును.)

(తెరలో)

ఓహో! మిత్రులారా! రండు రండు. హైహయునిమంత్రియగు చంద్రగుప్తుండు, మనగురువులవారిని జంపి కామధేనువును బంధించుకొని పోవుచున్నాఁడు. అయ్యయ్యో పరశురాముండాశ్రమంబున లేకపోయెనే మునిపత్నికీసంగతిఁ దెలుపుదము.

(రేణుకాదేవి శోకింపుచుఁ బ్రవేశింపుచున్నది.)

రేణు—(పడియున్న జమదగ్నిం జూచి) హా మనోహరా! విపులజపతపోగరిష్ఠా! నీకిట్టిగతిసంభవించినది! అరణ్యంబున ముక్కుమూసుకొని యిందిరారమణుని భజింపుచుఁ గాలంబుగడుపు నీవిప్పుడు మృతజీవావళిఁ జేరితివా! అక్కటా! ఆ కార్తవీర్యార్జునుండు మనయాశ్రమంబునకు వచ్చినప్పుడు చతురంగబలసమేతంబుగా నాతిథ్యంబునొసంగనేల? ఒసంగితివి పో ఆతుచ్ఛునకీకామధేనువుపై నాసజనింపనేల! జనించెను పో. వలదని నీవు మంత్రికిజెప్ప వాడువినక నీకీమృతి గల్పించెనుగా! అయ్యో! పజోలికిబోవక తపము జేసుకొను మునులనుబట్టి వధించురాజులును మంత్రులును ప్రబలుచుండిరా! ఇట్టిదుష్కార్యంబాచరించిన యీ చంద్రగుప్తుని వంశంబును, నిట్లుసేయుమని యాజ్ఞనొసంగిన హైహయుని వంశంబును నంతరించక నిలచునా!

(మునిబాలుఁడు ప్రవేశించును.)

ముని—తల్లీ! నీవిరీతిఁ జింతించినందువలనఁ బ్రయోజనంబేమున్నది? విచారముడుగుము.

రేణు—మునిబాలకా! ఆదురాత్ముఁడు నానాథునిం జంపఁగలిగెను గాని, కామధేనువును దోడ్కొనిపోఁగలిగెనా? అదిగో అటుజూడుము అది మరలవచ్చి యథాస్థానంబుననిలిచి మునీంద్రునిపాటున కెంతవగచుచున్నదో? (ఇంచుకయూరకుండి) మునిబాలకా! పతిలేని జన్మనక్షత్రీశుఁడులేనిరాత్రి కరణియగుసుగదా కాలన నాభర్తయేగతింపగా నేనుమాత్రము జీవంబులుధరించియుందునా చితిం జేర్పుము నేనందుఁ బ్రవేశించి నానాథునిగలిసికొనెద అక్కటా! పరశురాముం డింకను రాలేదుగదా!

(పరశురాముఁడు సునందునితోఁ బ్రవేశించును)

పర—మిత్రమా! సునందా!

సీ॥ నారాకఁ జూచియా - నందమందిమునిపు - త్రకుఁడొక్కఁడైనను
రాకయుండె!
అనుదినంబును సేయు - నంచిత వేదవా - క్పఠనంబు నేఁడువి
నఁబడకయుండె!
మునికాంతలెల్ల నా - మోముపీక్షింపుచు - నిలువకొక్కింతయు
నోలఁగుచుండ్రి!
అఖిలకోర్కులనిచ్చి - యలరారుచున్న గో - మాత పదేను
కా - న్పడకయుండె

తే గీ. కారణంబిసుమంతయుఁ - గానరాదు
యేమికీడు వాటిల్లెనో - యెరుగకుంట
గడుపులోనఁ జేయినివెట్టి - కలఁచినట్లు
లాయెనిప్పుడు నాకు నో - యనఁగుసఖుడ.

సున:—మిత్రమా! తొందరపడవలదు మనకెట్టి యిక్కట్టును ప్రాప్తించదు.

పర—(ఇంచుకనడచి) మిత్రమా! నామనంబంతయుఁ గలఁతఁజెందు

చున్నది మనలనుఁజూచి యీమునిబాలురెల్లరును దలలు వాల్చి కొనుచున్నారు మునికన్యలు దూరదూరముగాఁ దొలఁగు చున్నారు.

(ముని బాలుఁడు ప్రవేశించును.)

పర—(మునిబాలునిఁజూచి) మునికుమారా ఆశ్రమంబున మాత దండ్రులు క్షేమంబుగ నేయుండిరిగదా?

ముని—(తనలో) అయ్యో దారుణమగు నీవార్త యాతనికెట్లు విన్నవింపఁగలను!

పర—విప్రకుమారా! ఆలోచించెదవేమి? నీ వాలోచించినకొలదిని నాచిత్తంబున నాందోళన మధికంబగుచున్నది.

ముని—గురుకుమారా! చెప్పుటకు నోరాడకున్నది మీతండ్రిగారు దివంబున సుఖులై యున్నారు.

పర—(మూర్ఛిల్లి లేచి) హా!

తే. గీ. ఎన్నఁడును నన్ను నెడబాసి - యెఱుఁగనట్టి
నాదు జనకుండు నేడిట్లు - నన్ను వీడి
స్వర్గపుర సౌఖ్యములగాంచ - సరగనేగ
గారణంబేమియో నాకుఁ - గానరాదు.

మా తల్లిగారిప్పుడెచ్చటనున్నవారు?

ముని—మీతండ్రిగారి కళేబరమునొద్ద శోకింపుచున్నారు.

పర—అక్కటా! తల్లిగారిశోకంబును నెట్లుజూడఁగలుగుదును? నన్నామె యున్న చోటకుఁగొనిపొమ్ము.

(అందరును నడచుచున్నారు.)

రేణు—(పరశురామునిఁజూచి) ఈ! కుమారా! పరశురామా! వచ్చితివా?

తే. గీ. నీకుఁ గడుఁ గూర్పుజనకుండు - నాకుభర్త
భృగుమునీంద్రునిపుత్రుండు - సుగుణమూర్తి
తాపసులమేటి యాజమ - దగ్నియిట్లు
ధరణిఁబడియుండెఁ గంటివా - పరశురామా.

పర—(తండ్రినిఁ దలంచుకొని) తండ్రీ!

తే. గీ. పార్వతీశునినర్చించి - వరములెన్నొ
బడసివచ్చెను సుతుఁడంచు - భావమందు
మోదమందితివెంతయో - పుణ్యచరిత
యెవరుననుగూర్చి మోదింతు - రింకఁజెపుమ.

సునం—మిత్రమా! సహజధైర్యశాలివగు నీవిట్లు చింతింపవచ్చునా?

రేణు—(గుండెబగొట్టుకొనుచు) హా! ప్రాణేశ్వరా! మమ్ము విడనాడపోయితివా!

పర—(తనలో) నేనుగూడ యారీతినిశోకించుచున్నచో జననిశోకంబు మరింతహెచ్చును, కాలననేను ధైర్యముబూనియుండెదను.

సునం—

మ॥ జగమునీశ్వరశాశ్వతము - సర్వముకాగలరీతినయ్యెడుఁగా
మగుడవశక్యమేరికిని - మానసనీమఁ దలంచిచూడుమో
భృగుమునికోడలా మునుము - నీంద్రులుయెందరుచావలేదు
నీ విగపునుమానియుంక యున - భావమునందున ధైర్యమూనుమా.

సమస్తంబును దెలిసిననీకు నేను చెప్పునంతటివాడను గాను ఇట్టిది
సంసారంబునందున్న వారికెల్లను సంప్రాప్తమగుచు నేయుండును.

రేణు—మునికుమారా! నా ప్రాణేశుడు గాలము చేకూడి మరణించి
నచో నేనంతగా విచారింపను గాని దుర్మరణమందినందుకు విచా
రింపుచున్నాను.

పర—ఏమీ! మా తండ్రి దుర్మరణమందెనా? అందులకు గారణము!

రేణు—మహిష్మతీపురాధీశ్వరుండైన కార్తవీర్యుడు నిజసైన్యసమే
తంబుగా నాశ్రమంబునకు వచ్చుట యెఱుంగుదువు కదా?

పర—ఎఱుంగుదును తండ్రిగారు వారికాతిథ్యంబు నొసంగుటకాడ
యెఱుంగుదును తరువాతి సంగతి తెలియదు.

రేణు—ఆ రాజు ఆతిథ్యంబును గైకొనిపోయి యాశ్రమంబుననుండిన
సురభిపై నాసవహించి దానినెల్లయిన దెమ్మని యాతని మంత్రి
యగు చంద్రగుప్తు మీ తండ్రి కడకుఁ బంపెను.

పం—ఆతిథ్యంబు నొసంగినందువలన వచ్చిన ఫలమాయిది! తరువాత
నేమి జరిగినది?

రేణు—చంద్రగుప్తుండు మీ తండ్రియొద్దకరుదెంచి, రాజాజ్ఞను దెలిపి
సురభి నొసంగుమని వేడ యందులకంగీకరింపక పోవుటచే మీ తండ్రిని
వధించి సురభిం గొంపోయెను అయ్యాది వారిహస్తంబునం జిక్కక
యదృశ్యయై మరల యాశ్రమంబునకు వచ్చినది.

పర—(కోపముతో) ఆదురాత్ముఁ! మహిష్మతీపురాధీశ్వరా! దత్తా
త్రేయవరప్రసాదలబ్ధ మహాబలపరాక్రమసంపన్నుఁడనని గర్వించి
కన్నును మిన్నును గానక యిట్టిపనిఁ గావించితివా!

మ॥ వారునింగూర్చిహిమాచలంబున సము - ద్యద్ఘోరమహాసత్త్రపం
బుఁ దహింజేసి యభేద్యమౌ ఘనవరం - బుల్ గాంచి; దైత్యేశులన్
వరసంగ్రామతలంబునందుని మిదే - వశ్రేణిగాపాడి భా
స్వరకీర్తిన్ విలసిల్లినన్ను నుఁ దలం - పవ లేదుగా దుర్మతీ.

అరే పాపాత్మా! ఎంతకార్యముగావించితివిరా ఓరీ, దురాత్మా! నీకాతిధ్యమిచ్చినందుకు మాతండ్రికిఁ జేసిన ప్రత్యుపకారమా యిది? ఆసమయంబున నేనాశ్రమంబున నుంటినేని నీవున్నా మంత్రియు సేవలును నేమైయుండువారో! కానిమ్ము నీకు చేటుకాల మాసన్నమైనది (తల్లినిఁజూచి) అమ్మా! ఇంక నీవు ధైర్యము వహింపుము. నీవు నాతండ్రికై శోకింపుచు నిరువదియొక్క మారు రస్తాడనంబాచరించుకొంటివి. అయ్యది నే నింతకు పూర్వమే కన్నులారవీక్షించితిని కావున నా ప్రతిజ్ఞ వినుము.

మ॥ ధరలోనిర్వదియొకమారుహైహయున రేలన్ ద్రవాంతమ్మున వేడ్క మ
స్పరశుస్ఫారకఠోర ధారలెగయన్ • బాహాబలాటోపతన్
సరగన్ గూర్చి పితృక్రియల్ భువినినా • సల్ దీరగా జేసెదన్
ధరణీదేవచయంబు మెచ్చగను ద • ద్రక్తప్రవాహంబునన్.

సీ॥ కర్మసాక్షియగుచు • గగనప్రచారియౌ • జలజమిత్రుండును
తత్సాక్షిగాఁగ
వరములెన్నియొయిచ్చి • పరమగురుండైన • శంకరీరమణుండు
సాక్షిగాఁగ
అవతారములనెత్తి • యవనిభారముదీర్చు • శంకరమిత్రుండు
సాక్షిగాఁగ
సకలదిక్కులు నాక • సంబు రేయియు; బవల్ • చంద్రుండు
తారలు సాక్షిగాఁగ॥

తే. గీ. హైహయాది కంటకులైన • యవనిపతుల
నిజకుఠారధారాహతి • నేలఁగూర్చ

వాడఁ బ్రతిన బిల్చుకొనెడి • వాడ నమ్మ
సత్యమును దప్ప నీపాద • సాక్షిగాఁగ॥

రేణు—వత్సా! వీరపురుషుండవగు నీ కిది యసాధ్యము కాదు.

(భృగుమునీంద్రుండు ప్రవేశము.)

సునం—(పరశురామునిఁ జూచి) మిత్రమా మీ తాతగారు భృగు మునీంద్రులు వారే తెంచుచున్నారు.

రేణు-పర—(విచారించుచున్నారు)

భృగు—(ప్రవేశించి) వత్సా! పరశురామా అమ్మా రేణుకా మీరిం దుఖఁ జింతింపవలదు సమస్తంబును నే నెఱింగి జమదగ్నిం బ్రతికింపవచ్చినాను ఇదిగో చూడు మృతసంజీవని ప్రభావంబున నీతడు బ్రతుక గలఁడు (జమదగ్నిపై చేయి వైవగా లేచును.)

జమ—హా! దురాత్మా గోవును దిసికొని పోవు చుంటివా.

పర—తండ్రీ! తొందరపడకుము మన కామధేనువు వారికిఁ జిక్కక మన కడకే వచ్చినది.

జమ—నాయనా ఆ హైహయుం డెంత కార్యమును జేసెనురా! నీ వాశ్రమంబున లేకపోయితివి కదా.

పర—తండ్రీ! ఇప్పుడు మించిన దేమియు లేదు. నీ వా చంద్రగుప్తునిచే గూలి తాతగారి కటాక్షంబున మరల బ్రతికితివి. నేను జేసిన ప్రతిజ్ఞ యింక చెల్లించుకొనవలయును. తల్లిగారు నీకై శోకించుచు, యిరువదియొక్కమారు రస్తాడన జేసికొనఁగా నిరువది యొక్కమారును హైహయాదిభూపాలురను వధింతెద నని యిట్టి ప్రతిజ్ఞ జేసినాఁడను.

జమ—వత్సా! హింసింపుటవలన మనకు వచ్చులాభమేమున్నది? మనమా భూసురలము వారు క్షత్రియులు మనకిది తగదు.

పర—పట్టినపట్టు విడుచువాడనుగాను అనుజ్ఞనీయుడు.

జమ—(భృగువుం జూచి) తండ్రీ! ఏమిది కుమారునిదారుణ ప్రతిజ్ఞ?

భృగు—(చెవిలో నేదియో చెప్పును.)

జమ—కుమారా! పరమేశ్వరుని కృపాపారసంబునకు పాత్రుడవైన నీ కెల్లెడల జయమే యగుంగాక (ఇంచుక యూరకుండి) ఇంక రమ్ము తండ్రిగారి కాతిథ్యంబు నొసంగవలయును.

పర—మీ రేగుడు నే నిదే సురభి నోదార్చి వచ్చెదను.

(జమదగ్ని, రేణుక, భృగువు, నిష్క్రమింతురు.)

పర—మిత్రమా సునందా ఆదురాత్ముల హస్తంబునం జిక్కినందు కీధేను వెట్లు కన్నులనుండి నీరు గార్చుచున్నదో గంటివా?

(సురభిని సమీపించి)

మ॥ ధరణీకంటకుండైన హైహయనరేం । ద్రాదీశుండంపింపగా
సరగన్ వచ్చియమాత్యపద్యుడిటులన్ । గావించెగాయంబునీ
వరయన్ గన్నులనశ్రువుల్ విడువకో । యయ్యాయటంచున్ మహో
గురుశక్తిన్ వధియింతు భూపులనిక । గోమూర్తి దేవోత్తమా॥

మిత్రము—ఇంక మనమేగి కార్తవీర్యార్జునవధోద్యోగభారము బూనవలయును రమ్ము.

(ఇరువురును నిష్క్రమింతురు.)

ద్వితీయాంకము సంపూర్ణము.

శ్రీ

శమంతపంచకము.

తృతీయాంకము.

(మహిష్మతీపురం కార్తవీర్యార్జునుఁడు చంద్రగుప్తుడు ప్రవేశించుచున్నారు).

కార్త — మంత్రివర్యా చంద్రగుప్తా,

తే॥ గీ॥ అంతశ్శ్రమనందితివిగాని • యింతయేని
ఫలములభియింపగాలేదు • లలితచరిత
మౌనినివధించినను గాని • భవ్యసురభి
మనకు లభియింపగాలేదు • పాపమేమొ.

దానిసంబంధించి దోడ్కొని వచ్చునప్పుడదృశ్యయయ్యెనని నీవు పలికినపలుకులు నాకుమిగుల నాశ్చర్యంబు గలిగింపుచున్నవి.

చంద్ర — మహారాజా!

తే॥ గీ॥ అతనిప్రతిమాలియైనను • నట్లుగాక
యుండినవధించియైనను • ద్దంతబలము
చేతసురభిఁ దెచ్చెదనంచు • జేసినట్టి
ప్రతిజ్ఞఁదీర్పంగలేనైతి • క్ష్మాతలేంద్ర.

అందు మునినివధించుటయే తటస్థించెను గాని సురభిదక్కు నందుల కెంతయు చింతించుచు నుండుచున్నాను.

కార్త — అమాత్యవర్యా! గతజలసేతుబంధనమునకు విచారించినందు

వలనఁ బ్రయోజనంబేమియున్నది? మహాతపంబాచరించిన మానులకుగాని యాకామధేనువు లభియింపదని నేను మొదటనే చెప్పియున్నాను. కాని నీవు నామాటలువినక యెట్లయినను దెచ్చెదనని ప్రతినఁజేసితివి గోవులభియింపలేదు గాని తాపసునిమాత్రము వధింపఁగలిగితివి.

తే॥ గీ॥ కామధేనువుకొఱకున • కారణముగ
మౌనినివధించినయట్టి • పాపమెల్ల
కట్టి కుడుపునో మనలను • గానరాదు
మానసంబుగలఁత జెందె • మంత్రివర్య.

మ॥ ధరసంపద్విపులప్రతాపమహితై • శ్వర్యంబులంగాంచుచుం
జిరకీర్తిన్ వెలుగంగఁ జేయుచు జయ • శ్రీగాంచి; యాపైన మో
క్షగమ్యంబందగగల్గువారలుసుమా • సద్భక్తితో నెప్పుడున్
ధరణీదేవులఁబూజలన్ దనుపునా • ధాత్రీశురుల్ భూమిపై.

అమాత్యవర్యా భూసురపాదసేవ ధరాధీశ్వరులపాతకంబులు నశింపఁజేయును అట్టిచో నయ్యది భావింపక జమదగ్ని నకారణంబుగ హింసించితిమి నాయెడమకన్నును నెడమభుజంబును నదరుచున్నది ఏమికీడువాటిల్లునో తెలియకున్నది.

చంద్ర—

మ॥ ధరణీపాలకులావతంసవరద • దత్తాత్రేయభక్తుండవై
ధరణీపాలనమాచరింపుచు సమున్ • ద్యత్కీర్తిఁ జేఁబట్టి భూ
వరసంఘంబరిగాపులై యెప్పుడున్ సే • వల్ జేయు రాజిల్లు నీ
కరయం గీడులువచ్చునే నృపమణీ • యాత్మన్ విచారింపుమా.

సహజధైర్యచిత్తుండవగు నీకిట్లు చింతింపనేల?

సేవకుడు—(ప్రవేశించి) మహారాజా! ద్వారముకడనెవ్వరో భూసురుండు దేవరదర్శనార్థమై నిరీక్షించియున్నాఁడు.

కార్త — సత్వరమ్ముగ లోనికిం బ్రవేశపెట్టుము.

సేవ — చిత్తము (నిష్క్రమించి వెంటనే సునందునితో బ్రవేశించును)

కార్త — (సునందునిం జూచి) బ్రహ్మణోత్తమా! ఆ యాసనం బధిష్ఠింపుము.

సునం — (ఆసీనుండగును)

కార్త — భూసురేంద్రా!

తే. గీ. తావకీయసత్పాదసం ♦ దర్శనమున
మామకాఘంబులెల్లను ♦ బాయగంటి
పావనత్వముగాంచెను ♦ మందిరంబు
చింతలన్నియుం బాసితి ♦ స్వాంతమందు.

సునం — (తనలో) ఏమీ! యీవినయము నింత భూసురభక్తియుంట చేతనేకాబోలు జమదగ్నికట్టి కీడువాటిల్లజేసినాడు.

కార్త — ధరామరవంశమణీ! భవదీయనివాసస్థలం బెయ్యది? నీవే యభిధానంబునం దనరుచుందువు? ఇచ్చటి కెందులకై తెంచితివి? దయంబూని సెలవిమ్ము.

సునం —

తే. గీ. భవ్యజమదగ్నివనము ని ♦ వాసభూమి
తల్లిదండ్రులనామంబు ♦ దలపనేల
గురుఁడు; దైవంబు; తండ్రియు ♦ పరసఖుండు
పరశురాముండె నాకు భూ ♦ పాలచంద్ర.

ఉ. పేరుసునందుఁ డందురు వి ♦ వేకగుణాఢ్యుని ధీచరిత్రునా
చారపరున్ గుణాదరము ♦ సజ్జనుదానవలోకభీకరున్

సారధరామురేంద్రకుల • సంభవుపీరునితాజమదగ్నినిన్
జేరిహితంబువాటిలగ • జెన్నలతారుచునుంటిభూపతీ.

కం॥ ఆరాముండిటుఁబంపఁగ
ధీరతఁజనుదెంచినాఁడ • దిన్నగనిపుడే
కారణమరయఁగఁగోరిన
భూరమణా! చెప్పువాఁడ • బొందుగ నెల్లన్.

చంద్ర— ధాత్రీసురా! చల్లకువచ్చి ముంతదాచనేల? కారణము తెలుపక పోయినచో మాకేమి తెలియును.

కార్త— అదియేదియో సత్వరమ్ముగఁ జెప్పుము.

సుమ— రాజాగ్రణీ! వినుము నేను చెప్పుచున్న పలుకులు పరశురాముని వి. అతఁడిట్లు నీకుఁ జెప్పుమని నన్నుఁ బంపినాఁడు.

కం॥ దురితాత్ముఁడవై యాశ్రమ
సురభినినప్పుడపహరింప • జూచియమాత్యున్
సరగునఁబంపఁగజాలితె
దురితంబదియంచునీకు • దోచగలేదే.

ఉ॥ గోవునునీయనంచుఁ గడుఁ • గోర్కెమెయిన్ వచియించినట్టి స
ద్భావునితాపసేంద్రమణి • భవ్యగుణాఢ్యుఁడినాదుతండ్రిని
జీవముబాపఁజేసితివి • చిత్తమునందభిపోదునెంత; నిన్
నేవధియింపవచ్చితిని • భీకర ఘోర రణాంగణంబునన్.

క్షత్రియకాంతాగంబును నిరువదియొక్కమారు ఛేదించెదనని మాతల్లిగారితో ప్రతిజ్ఞఁ జేసియున్నాను అందులకై మాతండ్రినివధింపఁజేసిన దుర్మతుండవైన నిన్నుఁ దొలుత సంగ్రామంబునఁదాకి యమాలయంబున కంపవచ్చితిని కాలన సైన్యసమేతుండవై కదనంబునకరుదెమ్ము.

కార్త— (రోషముతో) ఆహా! ఏమి! మీ పరశురాముని ధైర్యసా

హాసము (మంత్రినిఁజూచి) చంద్రగుప్తా! వింటివిగదా పరశు
రాముని సందేశము?

చంద్ర—దేవా వింటిని రాజులతోఁ బోరాడఁగలిగిన శౌర్యసాహ
సంబులతోఁ నొప్పు భూసురులు వెలయుచున్నందుకు నవ్వు వచ్చు
చున్నది. ఇంక భూసురులే ధరాపరిపాలనంబొనర్చెదరు కాబోలు!

కార్త—మంత్రీ!

తే॥ గీ॥ భోజనంబులకు మఱియుఁ • బూజలకును
యజనయాగములకు బ్రహ్మ • కార్యములకు
దివ్యమతితోడ నేగు భూ • దేవులెల్ల
వచ్చియుండిరి కాబోలు • బవరమునకు.

(సునందునిఁజూచి) భూసురా! మీ పరశురాముండు మాపైకి
దాడివెడలివచ్చినాఁడా? ఇప్పుడెచ్చోటనున్నాఁడు? బ్రాహ్మణ
సైన్యంబు నెంతసహాయముగా గొనితెచ్చినాఁడు?

సునం—రాజా! ఈ హాస్యపుమాటలతో నేమిపనియున్నది?

తే॥ గీ॥ ఈశ్వరవరప్రసాదమై • యొగడునట్టి
పరశువొక్కటి చాలదా • బవరమునకు
పాఱు లేలయా చతురంగ • బలములేల
మూడులోకంబులను గెల్వ • భూరివీర
చరితుఁడైన రాముఁడొకండె • చాలునయ్య.

కార్త—ఆహా! ఏమి మీపరశురామునిప్రతాపము!

తే॥ గీ॥ భూసురాన్వయమందునఁ • బొడమియుండు
బ్రహ్మచారియై తపమున • వఱలుచున్న
పరశురాముని వీరుగా • బలుక నెట్లు
సమ్మతించెను చిత్తంబు • క్ష్మాసురేంద్ర.

సునం—కార్తవీర్యార్జునా! అతనికీర్తి వల్లికజగంబున నిదివరకే వ్రాకి యున్నది నేను వర్ణింపనవసరములేదు.

తే॥ గీ॥ వాసిమీఱగదపమునుఁ • జేసినాడు
అంచితంబుగశివునిమె • ప్పించినాడు
బవరమందుదైత్యులను దు • న్మాడినాడు
విబుధలోకంబుగాపాడి • వెలసినాడు.

చంద్ర—అతనికి మిత్రుండవైయుండుటకు నీకేచెల్లినది.

సునం—రాజేంద్రా! అనవసరప్రసంగముతో నేమిపనియున్నది.

తే॥ గీ॥ అతడుసమరసన్నద్ధుడై • యరుగుదెంచి
యిట్లునన్నుఁబంపింపగా • నేగుదెంచి
జెప్పవలసినదంతయు • జెప్పితింకఁ
బరశురామునితో బోర • సరగలెమ్మా.

ఇంకొక్కటిచెప్పుటమఱచినాను అతడు మీకిదికూడ చెప్పు మనియె.

చంద్ర—ఇంకను సందేశశేషమున్నదా!

కార్త—అట్లయిన నదికూడ సత్వరముగఁ జెప్పుము.

సునం—ఇదిగో వినుఁడు.

సీ॥ ప్రాణంబులరచేత • బట్టిసంగరభూమి
కంచితంబుగఁజను • దెంచుమనియె
యిష్టాళితోగూడి • నింపొందవిందులు
గోర్కెలుదీరగా • గుడుపుమనియె
వలసినభోగముల్ • వాంఛలుదీరంగ
వేడ్కమీరననుభ • వించుమనియె

కాంతతోగూడి యే • కాంతముగనుమంది
రమ్మనసుఖమునఁ • బ్రబలుమనియె

తే॥ గీ॥ బవరభూమికిజనుదెంచి • బాహుబలము
మెరయనాతోడఁబోరాడి • వతలుమనియె
జేతనైననూవిజయంబు • జెందుమనియె
జేతగాకున్నయమపురిఁ • జేరుమనియె.

కార్త—(కోపముతో) ఔరా! పాఱునికండకావరము దత్తాత్రేయ వరప్రసాదలబ్ధదుర్వారశౌర్యాటోప బహువిధశస్త్రాస్త్ర విరాజితుండనని యైనను దెలియలేదు కాబోలు

శా॥ లంకేశుఁ దశకంఠురాక్షసకులా • లంకారునిఁ మొన్నని
శ్శంకప్రాభవబాహుదర్పవిలస • త్సైర్యజరాజిల్లనా
తకంబూనక గట్టుసాహసబలో • దగ్రుండనౌనన్నునుఁ
గింకంరాముఁడుగూల్చునేఘనరణ • క్రీడన్ మహోత్సాహియై.

ఇంక నాలోచింపనేల? సునందా

తే॥ గీ॥ సత్వరమ్ముగనీవేగి • శౌర్యశాలి
యైనపరశురామునిఁగాంచి • యాజికిపుడె
వచ్చుచున్నాఁడగావున • భయమునంది
పాఱిపోకనిల్వుమటంచు • బలుకుమయ్య.

సునం—సరియే నే వేగెద. (నిష్క్రమించును)

కార్త—మంత్రీ! సునందుఁడేగినాడు. ఇంక కర్తవ్యమేమి?

చంద్ర—ఆలోచించుటకేమున్నది.

తే. గీ. ఒక్క బాపనిరాముని • నుక్కడంప
యోచనలు సేయవలయునా • యుద్ధమునకు

బంపుమా నన్ను నిప్పుడె • త్వరితగతిని
వానిఁ దెగటార్చివచ్చెద • మానవేంద్ర.

కార్త — సరే నీవెంట సుచంద్రునిగూడఁ బంపెదను మీయిరువురును దాకుఁడు రమ్ము.

(నిష్క్రమించుచున్నారు.)

(రంగము — మందిరంబునఁ గార్తవీర్యార్జునుఁడు
ప్రవేశించుచున్నాఁడు.)

కార్త — (తనలో) అక్కటా! నేఁడేమియోగాని నాహృదయం బంతయుఁ గలఁతఁజెందియున్నది పురంబున నుత్పాతంబులు పెక్కులు గలుగుచున్నవి.

తే॥ గీ॥ ఉత్తమాశ్వముల్ మేతల • నుడిగియుండె
మత్తగజములు చెలరేగి • పాఱుచుండె
బాలనీయక గోవులు • బఱగుచుండె
దుర్నిమిత్తముల్ పెక్కులు • దోఁచుచుండె.

అమగళంబును సూచింప శునకంబులు మొఱుగుచున్నవి, రాత్రుల యందు నక్కలు వాపోవుచున్నవి, గృధ్రంబులు పురివిచ్చి యాడగడిగినవి గుడ్లగూబలు పురంబునందెల్లడ స్వేచ్ఛగా విహారింపుచున్నవి ఇందులకుఁ గారణమేమియుఁ గానరాకున్నది ఎంతధైర్యమువహింతమన్నను చిత్తంబు సమ్మతింపకున్నది పమికీడు రానున్నదోగదా!

శా॥ ఆత్రేయప్రథితప్రసాదమునను • ద్యత్సంపదంగాంచి, సం
స్తోత్రంబుల్ దగఁజేయ గాన్నృపులు దై • త్యుల్ రావణుంగట్టి;
యీ ధాత్రీపాలనఁజేయుచుంటిఁగడు వెరా • దంకారగాబింకద
త్త్రాత్రేయుండుదలంచునో తలపడో • దాక్షిణ్యతన్ బ్రోవఁగన్.

(ఇంచుక యూరకుండి) పరశురామునితో సమరమొనర్ప వేగిన చంద్రగుప్త సుచంద్రులవిషయమై యింకను నేమియుఁ దెలియ లేదు.

సేవకుడు—(ప్రవేశించి) దేవా! సంగ్రామరంగంబునుండి జయంధరుండరుదెంచి సత్వరమ్ముగ మిమ్ముఁగననెంచి ద్వారముకడ నిరీక్షించియున్నాఁడు.

కార్త—ఏమీ! సంగ్రామరంగంబునుండి జయంధరుండరుదెంచినాఁడా? సత్వరమ్ముగఁ దీసికొనిరమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్రమించి వెంటనే జయంధరునితోఁ ప్రవేశించును.)

జయం—(ప్రవేశించి రాజుంజూచి) మహారాజా! వందనములు.

కార్త—జయంధరా నీవు సమరరంగంబునుండియేవచ్చుచుంటివా విజయవార్తవినుటకు తత్తరపడుచున్న నాచిత్తంబునకు సంతసంబుగొల్పుము.

జయం—దేవా! విజయవార్త దెలుపునంతటిభాగ్యమీ భృత్యుఁడు నోచుకొనలేదు.

కార్త—అయ్యో! మనకపజయంబుగలిగెనా యేమి? అదియేదో సవిస్తరంబుగఁ దెలుపుము.

జయం—దేవా! అవధరింపుడు దేవరవారివంపున రణంబునకరుదెంచిన చంద్రగుప్తుని పరశురాముఁడొక్కరుండును విలయకాలరుద్రునితెఱంగున దాకి, చంద్రగుప్తునివధించి యొక్కెడే మన సైన్యంబులనుదాకి, చీకాకుపఱచుచుండ, సుచంద్రుడు పఱుగిడుచున్న సైన్యంబులకు ధైర్యముజెప్పి మరలించుకొనివచ్చి, పరశు

రాముఁడిందాఁకఁ కరలాఘవ శరలాఘవంబుదీపింప నతిచిత్రంబుగఁ బోరఁగడంగెను.

కార్త — సుచంద్రుని జయించువీరుఁడీ ముల్లోకంబులయందును నెవ్వఁడును లేఁడుగదా!

జయం — సుచంద్రుని శౌర్యాటోపంబునకుఁ బరశురాముండే భీతిల్లి తనకుఠారంబును నేలఁబెట్టి యాతని నెట్లు వధింపఁగలుగుదునా యని కొంతతడవు విచారింపుచుండ, నాసమయంబున మింట నుండి యొక ఖడ్గంబుపడెను. అప్పుడాతఁడా ఖడ్గంబును గైకొని సుచంద్రునిదాఁకి, ఘోరంబుగఁ బోరాడి వధించెను.

కార్త — అక్కటా!

ఉ॥ కాలముమారిపోయెను జ • గంబున శౌర్యముబేర్చుచున్ ధరా
పాలురఁగూల్పసాగిరిఁక • బ్రాహ్మణవర్యులు కాకయున్నచో
నాలమునందువజ్రిని జ • రారిని గాలుని లెక్కసేయకే
మూలకుఁద్రోసిపుచ్చు పరి • పూర్ణబలుండగు నాసుచంద్రునిన్
గూలఁగఁ జేయశక్తుఁడగు • నో జమదగ్నికుమారుఁడిత్తరిన్.

జయంధరా! ఇప్పుడు రణభూమియం దెవ్వరున్నారు?

జయం — దేవా! రణభూమియం దెవ్వరున్నారని యడుగుచుంటిరా ఇదిగో వినుడు. వికటగతిం బఱతెంచు రథగజతురగపదాతిచరణతలసంఘట్టనంబున గెందూళి మార్తాండమండలంబు గప్పుటయు, భూగగనాంతరాళంబెల్ల మహాంధకారంబుచేఁ గప్పఁబడి సైనికులకుఁ గన్నును మిన్నును దెలియనీయక భయంబుగలుగఁ జేయుచుండ, వెన్నిడి పఱుగిడుచున్న మనసేనలను వెన్నంటి పరశురాముండొక్కరుండె ప్రచండగదాదండంబున మోదియు, కుఠారంబుచే తలలు చెండియు, శరంబులచే నురంబులగాడ నేసియు, గరవాలంబుచే గంఠంబుల నఱకియు, బాణవర్షము గురిపించుచు ఘనశౌర్య

విజృంభణంబునఁ బోరుచుండె. ఇప్పుడా సంగరరంగంబు, విభిన్న కాయంబులై నేలంగూలు శుండాలంబులును, విహతసారథికంబులై తెరలిపారు తేరులును, నెత్తురులు గ్రక్కుచు సుక్కుచెడిఁ గ్రుంగుపదాతులును, గలిగి యుద్వేల కీలాలపూరంబులు నీరంబులుగ, సామజకళేబరంబులు తీరంబులుగ, ఖండితవీరభటకరచరణాదులు జలచరసముదయముగ, బాండురాతపత్రోష్ణీషసమూహంబులు హంసంబులుగ, వికీర్ణకేశపాశంబులు శైవాలములుగ, మాంసపుముద్దలు దీవులుగ, గీకసగణంబులు శంఖంబులుగ రక్తనదిఁ బొంగి పొరలి భూతబేతాళశాకినీగణంబులకును, గంకగృధ్రకలకలరవంబులకు నాకరంబై భీభత్సముగా నొప్పుచున్నది.

కార్త—అక్కటా! కాలమహిమ కేమని చింతింతును! ఎన్నడును నాబలంబులకు రణంబున నవిజయంబుగలుగునని తలంచియుంటినా? ఆహా! నేటికొక భూసురునివలన మనకిట్లు ప్రాప్తించెను గదా!

(తెరలో)

చం॥ వనమున నేను లేనితరి • భవ్యచరిత్రుని నాదుతండ్రి గో
వునువారియింపఁగాఁ దలఁచి • పుణ్యముపాపముఁ జూడకుండ మం
త్రినిఁ గటకంపి మానినివ • ధింపఁగఁ జేసిన దుర్మదాంధుఁడ
ర్జునునిఁ గనంగ వచ్చె రిపు • సూదను డీజమదగ్నిసూనుఁడుర్.

కార్త—జయంధరా! ఆపలుకులెవ్వరివో వింటివా?

జయం—దేవా! భుజబలపరాక్రమంబున విజృంభించి మనసైన్యంబునెల్ల దునుమాడి గర్వాంధకారచేతస్కుడై మిమ్ముఁ జూచుటకుఁ దానే స్వయముగా వచ్చుచున్నాడు.

కార్త—రానిమ్ము వానిని నాబాహువులమధ్యనిఱికించి తుదముట్టించెదగాక.

జయం——(తనలో) ఇప్పుడాపరశురాముండిచ్చోటకరుదెంచి యేమి సేయునోగదా? ఒక్కడే, సహాయుఁడు సుమంతయు లేక, సమస్త సైన్యంబును తనకుతారంబునకు బలినిచ్చినజాడజూడ నాకెంతయు వింతయగుచున్నది. ఇంక నాభగవంతుఁడీ రాజేంద్రునిపట్ల నేమి సేయనుండెనో తెలియకున్నది.

(అంత పైపద్యమునుఁ జదువుచుఁ బరశురాముఁడు సునందునితోఁ బ్రవేశించును.)

పర——మిత్రమా!

తే॥ గీ॥ మనల నెదిరించి ఘోరమహా • భండనంబు
సలిపిచంద్రగుప్తాదులు • సమసినారు
కార్తవీర్యార్జుననినింకఁ • గాంచివాని
శూరతయు బాహుబలమును • జూడవలయు.

(కార్తవీర్యార్జునిఁజూచి) ఓహో! మహిష్మతీపురాధీశ్వరా! కార్తవీర్యార్జునా!

చం॥ వనమునకీవు మోదమున • బంధుసమేతముగాగవచ్చి మ
జ్జనకుఁడొసంగుసత్కృతులఁ • జక్కగనందియుఁ గామధేనువుఁ
గోనమది నెంచిమాయలనుఁ • గొన్నిటఁబన్నియమాత్య శేకరుఁ
బనిచివధింపఁ జేసితివె • మజ్జనకుఁ మునినాథచంద్రునిఁ.

ఓరీ! దుర్మదాంధా! కన్నును మిన్నును గానక నిట్టి యకార్య మాచరించి యింకను బ్రతికియుంటివా? తగుదునని యింకను భూమండలంబునఁ దలయెత్తి మెలంగ నెంచితివా? ఇట్టియకార్యములు సేయుటకే కాబోలు దత్తాత్రేయుండు నీకువరంబుల ననుగ్రహించియున్నాడు? ఏమిరా! నీరాజ్యపరిపాలనము?

తే. గీ. తాపసుల కెట్టిబాధలు • ధరణియందు
గలుగకుండంగ నరపతుల్ • గావవలయు

గాని యిట్టులు ఘోరమౌ • కాననముల
జపము జేసికొనెడివారిఁ • జంపనగునె.

నీకు వినాశకాలము సమీపించుటచేతనే యిట్టి యకార్యమును జేసితివి. తత్ఫలంబిప్పుడే యనుభవింపఁగలవు.

చం. ఇరువదియొక్కమారులు న • హీనపరాక్రమ విక్రమంబునన్
ధరణిపులన్ వధింతునని • దారుణమైన ప్రతిజ్ఞజేసి స
త్వరముగ వచ్చినాఁడటకు • భండనమందున నీదుమంత్రినిన్
వరసఖుఁడౌ సుచంద్రుని గ • భాలున నేలఁబడంగజేసితిన్.

ఇంక నీబలపరాక్రమంబులు వీక్షింపవలయును. రణాతిథ్యంబు గోరివచ్చిన యీపరశురాముండింక నిన్నుఁ బ్రాణంబులతోఁ బోనిచ్చువాఁడు కాఁడు.

తే. గీ. తాపసోత్తముల వధించు • ధరణిపతులు
బ్రతికియుండుట భూమికి • బరువుగాదె
అట్టి ధరణీశ్వరుల నెల్ల • మట్టుఁబెట్టి
ధరణి భారము బాపెదఁ • దప్పకిపుడు.

ఇదియే నాప్రతిజ్ఞ.

కార్త—ఓయీ! పరశురామా! రణంబున జయంబు దైవాధీనము. ఇంతమాత్రముచేత నీవు గర్వించి నాకంటె బలపరాక్రమవంతుఁడెందును లేడని తలంపకుము.

కం. భూసురుఁడవైన నీకిటు
వాసిగ లజ్జన్ద్యజించి • పలుకంగా నీ
కే సరిపోవుచున్నది కా
నీ; సంతోషంబులేదు • నిక్కము మాకున్.

నీవు నన్ను రణంబున దాకవచ్చినందుల కాశ్చర్యము గలుగుచున్నది. నీవు ప్రాణంబులపై నాసవీడియే నాతోఁ బోరఁదలంచి వచ్చితివని తలంచెదను.

పర—ఓరీ! గర్వాంధకారప్రమత్తహృదయా! ఇన్నిదినంబులనుండియు నాకంటె బరాక్రమవంతుండు లేడని చరింపుచున్నావు. అట్టి నీగర్వభూజంబును సమూలంబుగాఁ ద్రెంపివేయుటకే పరశురాముండు జనించెనని తలంపుము. ప్రాణంబులపై నిరాసవహించియే వానితోఁ బోరనేతెంచితివాయని యడుగుచుంటివి. అయ్యది నీవును నేనును నెట్లు నిరూపింపఁగలము?

కార్త—రణంబనఁగా దర్భపోటులకేగుటయని తలంచితివాయేమి? భుజబలపరాక్రమంబున విజృంభించి సంగ్రామరంగమధ్యంబున వీరవిహారంబుసల్పుటకు మాకే చెల్లును గాని, మీకుఁ జెల్లదు. అవురా! ఏమి నీసాహసము! నాపరాక్రమము నీవెఱుంగవు కాఁబోలు!

తే. గీ. మూడులోకములందును ♦ నీడు లేడు
వాకటంచును నెంచుచు ♦ భీకరగతి
సంచరించెడు రావణు ♦ నంచితముగ
బందిగంబునఁ బెట్టిన ♦ వార్త వినవె?

పర—ఎఱుఁగ కేమి!

తే. గీ. వలయు నేని నీవిపుడ రా ♦ వణునిఁ జేరి
సాయమును జేయ గమ్మంచు ♦ సమరమునకు
దీపికొనిరమ్ము మల్లైన ♦ కాసిమీర
నిరువురను నొకసారియే ♦ ధరణిఁ గూల్తు.

కార్త—నీకు వాగాడంబర మధికమగుచున్నదే?

పర—అనవరతపరిసంగంబుతోఁ బనియేమున్నది.

మ. ఇదిగో చూడు కుఠారరాజమిపుడే ♦ యద్దానిచే బాహువుల్
గదనంబందునఁ గూల్చి నీదుశిరమున్ ♦ ఖండించి గావింతు విం

డు దగన్ భూతగణంబు చిత్తముల సం • తోషంబుచుంబొందరా
త్రిపదరంబెల్ల భయంబునందగ భువిన్ • రాజద్బలాటోపతః.
రమ్ము. యుద్ధగంగంబున కవతరించుము.

కార్త—సమరోచితస్థలంబునకరుగుదము రమ్ము.

(కార్తవీర్యుడును—పరశురాముడు నిష్క్రమింతురు.)

సునం—(తనలో) మా పరశురాముండు కోపావేశంబున గార్తవీర్యార్జునునితోఁ బోరుటకేగినాఁడు. ఈహైహయుడు సామాన్యుడుగాడని వినియుంటిని. ఇప్పుడేమగునో తెలియకున్నది. (ఆలోచించి) ఏమిదీ! నేనాలోచింపుచుంటిని. విజయలక్ష్మి మాపరశురామునిగాక యన్యునివరించునా? అది కలలోనివార్త. (ఇంచుక యూరకుండి) ఈపరశురాముండు సామాన్యుడుగాడు. భాసురునియందిట్టి బలంబును, తేజంబును నెచ్చటనైనఁజూచియుంటినా? ఈతనితో మైత్రి పాటించి యాతని వెంటనున్న నేనెంతయు ధన్యుండను. (ఎదుటఁజూచి) అడుగో! సామిత్రుడు విజయలక్ష్మీలాలితుడై వచ్చుచున్నాఁడు.

పర—(ప్రవేశించి) సునందా! నీవిచ్చటనేయుంటివా? నీకేమిభయము గలుగుచున్నదోయని శంకింపుచుంటిని.

సునం—మిత్రమా! నీయుండనుండగా నాకేమిభయము. విజయలక్ష్మినివరించి యెప్పుడరుదెంతువాయని వేచియుంటిని.

పర—మిత్రమా!

తే. గీ. జననిముందుఁజేసిన ప్రతి • జ్ఞ నెఱవేర
హైహయుని రణమున దెగ • టార్పఁగంటి
సకలసైన్య మిత్రసుబంధు • సంయుతముగ
నింక మన కేమి కావలె • నిపుడు జెపుమ.

ఈవిజయంబునకు గారణభూతుండాశంకరుండు గావున నేనిప్పుడే కైలాసంబున కేగి, యమ్మహానుభావున కీవిజయవార్త దెలిపి యనంతరంబాశ్రమంబున కరుదెంచెదను. నీవుమాత్రము మాయాశ్రమంబున కేగి నాజననీజనకులకీసంగతి దెలిపి యచ్చోట నారాకకై నిరీక్షింపుచుండుము.

సునం——మిత్రమా! ఆజ్ఞననుసరించెద గాక.

(ఇరువురును చెరియొకత్రోవను నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.



శ్రీ

శమంత పంచకము.

చతుర్థాంకము.

(కైలాసము—మందిరద్వారంబున విఘ్నేశ్వరుఁడు ప్రవేశము.)

విఘ్నే—(తనలో) ఎవ్వరైన వచ్చినచో రానీయవలదని నాతల్లిదండ్రులు చెప్పిరి. గావున నేనతిజాగరూకుండనై యుండవలయునుగదా.

పర—(ప్రవేశించి) ఆహా! కైలాసంబు జేరికొంటిని. ఈశుధరసందర్శనమాత్రంబుననే నాకెంతయో సంతసంబు స్వాంతంబున జనించుచున్నది. ఇంక బరమేశ్వర పాదారవిందసందర్శనంబు జేసినచో నాయానందంబునకు మేరలేకయుండునుగదా. (ఇంచుకయూరకుండి) ఇంక నేనాలోచింపనేల! సత్వరమ్ముఁగ బార్వతీపరమేశ్వరుల సందర్శించెద. (ముందుకునడచును.)

విఘ్నే—(పరశురామునిఁజూచి) భూసురోత్తమా! పరశురామా! ఎప్పుడరుదెంచితివి?

పర—భ్రాతృసమానా! ఇప్పుడేవచ్చితిని. పార్వతీపరమేశ్వరుల సందర్శనము నేను సత్వరమ్ముగఁ జేసికొనవలయును గాన వారెందున్నవారో చెప్పుము.

విఘ్నే—అయ్యా! వారు రహస్యమందిరంబున నున్నవారు. సత్వరమ్ముగనే రాఁగలరు.

పర—అట్లయిన నేనే వారియొద్దకేగెదను. (వెళ్లఁబోవును.)

విఘ్నే—(వారించును.)

పర—విఘ్నేశ్వరా! పార్వతీపరమేశ్వర సందర్శన కుతూహలాయత్తచిత్తుండనై యరుదెంచిన నాకు నిరుత్సాహంబు గలిగింపుచుంటివేమి? నేను వారున్నచోటికిఁ బోవలదా?

విఘ్నే— తే. గీ. సతులతోఁగూడి భర్తలు • భవ్యమంది
రంబులందునుండెడి సమ • యంబులందు
పరపురుషులెవ్వరైనఁ బో • నలదు గాన
నడ్డుపెట్టితి నిన్ను నో • యమలచరిత.

పర—ఓహో! ఇదియా కారణము? నీవు చెప్పినట్లు నేను పరపురుషుండను కాదుగదా? నీతండ్రి నీకెట్టివాఁడో నాకును నట్టివాఁడే. అదియుంగాక నాతండు నాకు గురుండును దైవంబునునై యొప్పుచున్నాఁడు. అతండెట్టి రహస్య మందిరంబులయందున్నను నేనేగుటకు స్వాతంత్ర్యము కలదు. కావున నన్ను వారింపకుము.

విఘ్నే—పరశురామా! నేను వచించినమాట వినుము.

తే. గీ. పార్వతీపరమేశ్వరుల్ • త్వరితగతిని
వత్తురింతలోఁ దొందర • పడగనేల
నంతలోన నడచిన యా • యాసమెల్ల
దీర విశ్రమింపుమిచట • వీరచరిత.

పర—అయ్యా! నాకు విశ్రమించుటకు గాలము కాదు. హైహయాది భూపాలురను సంగ్రామక్షితలంబునఁ దెగటార్చి వచ్చితినన్న విజయవార్త పార్వతీశ్వరున కెఱింగింపకుండ విశ్రమించుటకు నాచిత్తంబు సమ్మతింపదు.

తే. గీ. పుట్టు బ్రహ్మచారినిగదా • పుణ్యమూర్తి
యైన పరమేశ్వరుఁడు దా • సతితోడ

సంచరింపఁబడుపట్టునఁ • జనఁగరాదొ
తండ్రిపై భేదముండునే • తనయునకును.

కావున మందిరప్రవేశంబున కాటంకంబు గలిగింపకుము.

విఘ్నే—నేనెన్నిసారులు జెప్పినను నీవుమాత్రము పట్టినపట్టు విడువకున్నావు. అట్లగితివేని మహాపాపంబు నిన్నుఁ జుట్టుకొనఁగలదు.

పర—అది యితరులపట్ల వర్తించును గాని నాకుగాదు.

తే. గీ. జనకునొద్దకు సుతుఁడేగ • జనదటంచు
నిపుడె విన్నవాఁడను గాని • యెన్నఁడెరుగ
నాకు నీతోడఁబనియేమి • నాదుగురుని
చెంతకేగెదఁ జూడుమా • శీఘ్రగతిని.

విఘ్నే—(వారించి) నీవు పట్టిమూర్ఖునివలె నున్నావు. ఎంతచెప్పినను వినవేమి?

పర—నామూర్ఖతతో నీకేమిపనియున్నది? నన్నుబోనిమ్ము. నీవు నాప్రవేశంబున కాటంకంబు గలిగించితివేని, హానిగలుగును.

విఘ్నే—(కోపముతో) ఓహో! నిన్ను వారించినచో నాకు హానిగలుగునా? ఈభీతిఁబుట్టించువాక్యంబు లెచ్చట నేర్చితివి? నీకిక్కడ భీతిల్లువారెవ్వరును లేరు. నీవు లోనికేగరాదు. పగితివేని నీకే హాని వాటిల్లును.

పర—ఓయీ!

తే. గీ. పరశుచేతను నిన్ను దు • న్మాడిరయైన
శివుని సన్నిధికేగెద • శీఘ్రగతిని
ప్రాణముల నేలపీడెదు • వదలుమిపుడు
కాకయుండిన వేరమ్ము • కదనమునకు.

విఘ్నే—పోరాటంబనగా దర్భపోటుల కేగుటయని తలంచితివా యేమి?

పర—కుడుములు మెక్కుటయు, నెలుక నెక్కుటయునని తలంచితిని.

విఘ్నే—ఛీ! గురుద్రోహీ! నీముఖంబుఁ జూచినచోఁ బంచమహాపాతకంబులును సంభవించును.

(ఇరువురును యుద్ధంబునకు మొనయుచున్నారు.)

పర—ఓరీ!

తే. గీ. భవునిదర్శన భాగ్యంబు • బడయుగోరి
వచ్చియున్నట్టి నన్నిప్డు • వారణంబు
జేయుచున్నందులకు నీకు • శిక్షగాఁగ
విఱుగఁగొట్టెద దంతంబు ? సరగనిదిగో.

(గణపతికి దంతము విఱుగఁగొట్టఁగా నేలఁబడును.)

(అంత తొందరగాఁ బార్వతియు శంకరుండును ప్రవేశించుచున్నారు.)

పార్వ—ప్రాణేశ్వరా! మీరు ముందు వెనుకలారయకుండఁ బ్రతివారికిని వరంబుల నొసంగుచుందురు. మీభక్తుండును శిష్యుండును నగు నీపరశురాముండు కుమారున కెంతపాటు దెచ్చెనో కంటివా? ఇదియంతయు మీమూలముననేకదా! నాతనయునిదీసికొని నేను పుట్టినింటకేగెదను. మీరాయిచ్చవచ్చినయట్లుండుడు. నేడు దంతము విఱుగఁగొట్టెను. రేపు ప్రాణంబులనుదీయును. అప్పుడైనను నిల్వారకొనవలసినదేగదా?

శంక—రమణీ! శాంతింపుము.

పర—(శంకరునిఁజూచి)

ఉ. ఏపరమేశు దివ్యకృప • నెంతయు నందగనోచినాఁడ; ని
ష్ఠైపరమాత్ము సత్కృప న • హీనబలంబున హైహయాది భూ

మీపతులన్ వధించి భువి • మెండగుకీర్తినిఁ గాంచఁగంటివి
న్నా పరమాత్మ నీశుని గు • ణాఢ్యుని సంతతమున్ నుతించెదన్.

(పార్వతింజూచి) జననీ! పార్వతీమహాదేవి. త్వత్పాదారవిందంబులకీభక్తుండు నమస్కరింపుచున్నాడు.

పార్వ—(అసూయతో) ఛీ! నీముఖంబుజూడరాదు. భూసురుండవయ్యును శాంతంబు నిసుమంతయుఁబూనక నాకుమారునిట్లు బరిభవించితివి. గురుపుత్రుని కెగ్గుజేసినచో గురునకుఁ జేసినట్లు గాదా? తాల్మిలేని నీతపంబేల? తన తనయుని నిట్లుసేయుమని యేనా నాభర్త నీకస్త్రవిద్యనిచ్చినది?

పర—(పార్వతిపాదంబులపైఁబడి)

మ. అది నాతప్పు సహింపుమమ్మ జననీ • యాతండు లోకేశు స
త్పద సందర్శనమాచరించుటకు మో • దంబార నేరాఁగ నె
మ్మది కుత్సాహము దగ్గువాక్యములనున్ • బల్కంగఁ గోపంబుచే
గదతోఁగొట్టితి దంతమున్ విఱుఁగగా • గాపాడి రక్షింపుమా.

నన్ను రక్షింపవేని శాపంబిచ్చి నన్ను జంపుము. నీపాదంబులు విడువను.

(అంత విష్ణుమూర్తి ప్రవేశము.)

విష్ణు—(పరశురాముంజూచి) పరశురామా లెమ్ము లెమ్ము.

శంక—దేవా! రమారమణా! నీరాకచే మేము ధన్యులమైతిమి.

విష్ణు—(పార్వతింజూచి) తల్లీ! పార్వతీ! ఈపరశురాముండు, నీకుమారునకిట్టి వంతతెచ్చెనని నిందింపకుము. ఇదియొక కారణముచేత సంభవించినది. ఇంతటినుండి భవత్పుత్రుండేకదంతనామంబునఁ దనరఁగలఁడు.

పర—(విష్ణుంజూచి) మహానుభావా! త్రిలోకపూజిత పాదకంకేరుహా.

మ. మునులుం జ్ఞానులు సాధుమార్గచరులే • పుణ్యాత్ములింజూడగా
ఘననిష్టం దపమాచరించిరిమ గర్వం • గానంగ లేకుండురా
ఘనకాద్యుత్తమ మౌని పూజితపదా • జ్ఞాతున్ రమాధారుని
గనఁగానోచితి నిప్పుడీయెడల భా • గ్యంబెన్న సామాన్యమే.

విష్ణు—పరశురామా! ఇంకనీవు నీయాశ్రమంబునకుబొమ్ము. (శంక రునిఁజూచి) శంకరా! నేనేగెదను. (నిష్క్రమించును)

పర—పార్వతీపరమేశ్వరులారా! నాకనుజ్ఞనీయుడు. నేనేగెదను.

శంక—మంచిది.

(అందరు నిష్క్రమింతురు)

(రంగము—జమదగ్ని యాశ్రమము.)

సునం—(ప్రవేశించి) కైలాసమ్మునకేగి పార్వతీపరమేశ్వరుల సందర్శనమాచరించి సత్వరమ్ముగ నరుదెంచెదను కావున నీవాశ్రమంబునకేగి నారాకకై నిరీక్షించియుండుమని చెప్పి పరశురాముండింకను రాలేదేమోగదా? అక్కటా! నేనాతనివెంటనుండక యిక్కడికేల యరుదెంచితిని! వృద్ధతాపసదంపతుల మరణంబు గన్నులార జూచుటకే నామిత్రుండు నన్నిచటకుఁ బంపినాడు. అక్కటా! అదురాత్ములగు కార్తవీర్యార్జునుని పుత్రుల కీజమదగ్నిని వధించుటకుఁ జేతులెట్లాడెనోగదా! పరశురాముండరుదెంచి నాతల్లిదండ్రులేరియని యడిగిన నేనేమని ప్రత్యుత్తరంబిచ్చెదను? (విచారింపుచున్నాడు.)

(పరశురాముఁడు ప్రవేశించును.)

పర—(తనలో) ఏమిదీ! ఆశ్రమంబంతయుఁ జిన్నవోయియున్నది?

తే గీ. నలినసంతతి లేనట్టి • కొలనుబోలె
దీపపంక్తులులేని మం • దిరముభాతి

శారికాతతిలేని పం • జరముకరణి
బెఱగుచున్నది యిప్పుడీ • పర్ణశాల.

ఇందులకుఁ గారణంబేమైయుండునోగదా! మాతల్లిదండ్రులు సుఖంబుగ నేయుండురుగదా. అదియేమికారణమోగాని నాయెడమకన్నును నెడమభుజంబును నదరుచున్నది. (ఎదుటఁజూచి) అతఁడుగో నామిత్రుండగు సునందుఁడచ్చట నేయున్నవాఁడు. సమీపించెదగాక. (ఇంచుకనడచి) ఏమిదీ! ఈతండు నన్నుఁజూచినంతనే తలవాల్చి కన్నుల నశ్రుబిందువులు గార్చుచున్నాఁడు?

సునం—(తనలో) అక్కటా! ఈతనికీవార్త నెట్లువినిపింపఁగలను!

పర—(సునందునిఁజూచి) మిత్రమా! సునందా! ఆశ్రమంబున నా తల్లిదండ్రులు క్షేమంబుగ నున్నవారా?

సునం—(తనలో) ఏమనిచెప్పుదును!

పర—మిత్రమా! ఆలోచించెదవేమి? నీయాలోచన నాకు సంతాపంబుగలుగఁ జేయుచున్నది.

సునం—తే. గీ. అక్కటా నిన్ను చింతాబ్ధి • యందు ముంచు
వార్తఁ జెప్పుటకే ముందు • వచ్చినాఁడ
నాశ్రమంబునకిప్పుడో • యనుఁగుసఖుఁడ
యేల పంపినాఁడవు నన్ను • జాలిమాలి.

పర—మిత్రమా! విచారించెదవేల? ఏదియైనను గాలగతినిఁబుట్టి వచ్చుచుండునుగదా సత్వరమ్ముగ నట్టిదేదియో తెలుపుము.

సునం—ఎంతవరకు నేనూరకొన్నను జెప్పకతప్పదు. నేనాశ్రమంబునకరుదెంచి నీవిజయవార్త నీతల్లిదండ్రుల కెఱింగించితిని. ఆమరుచటిదినంబున హైహయుని నీవు వధించుటంజేసి కోపావేశంబున నాతనిపుత్రులు మనయాశ్రమంబునకు వచ్చి నీజనకునివధించిరి. భర్తతోపాటు నీజననియు నగ్నింబడి ప్రాణంబులవిడచెను.

పర—హా! తల్లిదండ్రులారా! మీకెట్టియవస్థగలిగినది. కార్తవీర్యార్జునుని వధించినవెంటనే నేనాశ్రమంబునకురాక, కైలాసంబునకేలపోయితిని? అట్లు చేయకయుంటినేని మీకీపాటు సంభవించియుండదుగదా! హా! తల్లిదండ్రులారా! మీరు ప్రాణంబులను విడుచునప్పుడు నన్నెన్నితలంచితిరో! అయ్యో! నేనుండియు రక్షింపలేకపోయితినిగదా!!!

సునం—మిత్రమా! గతించినదానికిఁ జింతించినందువలనఁ బ్రయోజనములేదు. శోకంబువిడచి ధైర్యచిత్తుడవుగమ్ము.

పర—ఇదిగో శోకంబువిడిచినాను. వృద్ధతాపసదంపతుల మృతికి గారణులైన యర్జునునిపుత్రులను నాకుఠారంబునకు బలియొసంగెదగాక. అదియుంగాక మున్ను మాతల్లితోఁజేసిన ప్రతిజ్ఞప్రకారము యిరువదియొక్కమారు క్షత్రియులవధించి తద్రక్తంబుచే పితృతర్పణంబులజేసెద. నేనిదె యేగెదను. నాప్రతిన నెరవేఱువరకును నేనాశ్రమంబునకురాను. అంతపర్యంతంబును నీవిచ్చటనుండుము.

సునం—మిత్రమా! నిన్నెడఁబాసి నేనుండఁజాలను. నన్నుగూడ నీవెంటఁగొనిపొమ్ము.

పర—సఖుడా! నేనతిరౌద్రంబేర్చి క్షత్రియహింస సేయుతఱిని నీవు భయమందుదువేమోయని యట్లంటినిఁ గాని యిచ్ఛయున్నచో రమ్ము.

(నిష్క్రమించుచున్నారు.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

శమంతపంచకము.

పంచమాంకము.

రంగము—శమంతపంచకము.

(పరశురాముఁడు—సునందుడు ప్రవేశము.)

పర—మిత్రమా! సునందా! నాజననితోఁ జేసిన ప్రతిజ్ఞప్రకార మిరువదియొక్క-మారులును రాజన్యులను వధించితిని.

మ. మును నాచేసిన ఘోరమహాప్రతినకై • భూపాలకాంతారముల్
బరిచ్ఛేదించి తదీయరక్తమున నా • నందాబ్ధి నోలాడుచున్
సరగన్ బుచ్చితి దర్పణంబుల గదుర్ • మాతల్లిదండ్రుల్ మదిన్
బరమామోదమునందగాఁ; సుతుని స • ద్భావాంబలపాత్రికిన్.

ఇచ్చోట నైదుసరస్సులు నిర్మించి వాటికి శమంతకపంచకంబని నామంబిడి యందు క్షత్రియరక్తంబునుఁ బూరించి దానిచే బితృక్రియలందీర్చితిని. ఇంకను నెచ్చటనైన క్షత్రియులున్నవారేమో చెప్పుము. జగంబక్షత్రియంబు జేసెద.

సునం—మిత్రమా! నీకింకను గోపముతీరలేదుగదా! నీభీభత్సాకారము చూడ నాకే భయముగలుగుచున్నది.

పర—ఈవిజయంబులకు గారణమాపరమేశ్వరుఁడుసుమా.

(ప్రవేశము—దశరథుఁడు రాముఁడు.)

దశ—వత్సా! రాఘవా! తెల్లవారవచ్చుచున్నది. త్వరగా నడువుము.
రాము—(అట్లనే చేయును.)
పర—(దూరముగా నిలువబడి చూచి)

మ. వర బాహాబలవిక్రమక్రమ లస • త్ప్రజ్ఞావిశేషంబునన్
హరుచాపంబునువంచి జానకిని న • య్యబ్జాతపత్రాక్షినిన్
ధరణిన్ బెండిలియాడినాననుచు మో • దంబందుచున్నాఁడవా
ధరణీపాలక; యెందుబోయెదవు యీ • ధాత్రీసురుండుండగన్.

దశ—(విని) అక్కటా! ఇదియేమిఅన్యాయము! పుత్రా! చూచితివా?

తే॥ గీ॥ కోపమీరీతిభూమిపై • దూపుఁదాల్చి
యవతరించుచుగాబోలు • నంచుఁదోఁచ
ప్రళయకాలరుద్రునిరీతి • మండిపడుచు
వచ్చుచున్నాఁడుచూడుమా • పరశుధరుఁడు.

నాయినా! ఈతనినిఁజూడఁగానే నాకు మిగులభయంబుగలుగుచున్నది. ఈతఁడిప్పుడు మనకేమిహానిసేయునోగదా! ఈతఁడప్రతిమానశౌర్యశాలి క్షత్రియులను నిర్వదియొక్కమారువధించి కళేబరంబులను నిర్జరలోకంబునకు సోపానంబులుజేసి తద్రక్తంబునఁ బితృక్రియలను దీర్చినాఁడు.

రాము—తండ్రీ! ఆతఁడట్టివాఁడేయగుఁగాక. ఆతఁడు మనకేమిహాని గూర్చును. మనమతనికేమియపకారముగావించియుంటిమి?

దశ—క్షత్రియులన్న నీతనికి గిట్టదు.

రాము—అకారణంబుగ మనకు హానిచేదలంచినచో శరాసనము నాయొద్దనేయున్నదిగదా! నీవు భయమందఁబనిలేదు.

దశ, రాము—(పరశురామునిఁ జూచి) భూసురోత్తమా! భవదీయ దివ్యపాదపంకేరుహంబులకు నమస్కరింపుచున్నాము.

పర—(దశరథునిఁ జూచి) ఛీ! గాజులు తొడిగించుకొనియున్న ఆడుదానివగు నీ ముఖంబు చూడరాదు. (ఇంచుక యూరకుండి) ఏమిరా! నీవినయము? నేను మిమ్ముల నేమి సేయుదునో యని భయంబంది రామునిచే మ్రొక్కించుచుంటివా! ఈ పరశురాముండు మ్రొక్కులకు దయదలచువాఁడు కాఁడు. (రామునిఁ జూచి) ఓయీ రామా!

తే॥ గీ॥ హరుని కోదండమును వంచి • యలరితంచు
నే; మహేంద్రాద్రిపై విని • నీదు బలము
శౌర్యమును విక్రమంబును • సాహసంబు
గాంచ నేతెంచినాఁడను • క్ష్మాతలేంద్ర.

హరుని కోదండమును వంచినందులకు గర్వింపకుము. ఇదిగో నాచేతనున్న విల్లు విఱిచి నీ లావు జూపుము.

దశ—(కరంబులు మోడ్చి) మహానుభావా! పరశురామా! యజ్ఞసమయంబున, సకలధరిత్రీతలంబును కశ్యపాదిభూసురులకొసంగిన దాతవు పుట్టు బ్రహ్మచారివి. అట్టి నీవ కారణంబుగఁ బసిబాలుఁడైన రాముపై నలుగఁ జెల్లునా?

పర—(కోపముతో) ఏమీ! రాముండు పసిబాలుఁడా? శివధనుర్భంగము గావించినప్పుడీ పసితనం బెచ్చటికిఁ బోయినది? అది యట్లుండనిమ్ము. మద్గురుచాపభంగమునుఁ జూచి నేను సహింపఁగలనా? (రామునిఁ జూచి) రామా! నీ బలం బెట్టిదో చూపినఁగాని యొక్కయడుగైనను నవతలఁ బెట్టనీయను.

రాము—(తండ్రినిఁ జూచి) తండ్రీ! నీ వింక నూరకొనుము. నేనీ మహాత్మునకుఁ బ్రత్యుత్తరం బిచ్చెద. (పరశురాముని విలోకించి)

తే॥ గీ॥ భూసురుండవు ఘనతపో • భాసురుండవు
గాన నీయందు భక్తినిఁ • బూని [illegible]

జేసితివిఁగాని యాజికిఁ ♦ జిత్తమందు
భీతి నొందుటకాదయ్య ♦ వీరచరిత.

అదిగో నీచేతగుఠారంబున్నది ఇదిగో నాగళము నీకెయ్యదియుచితంబో యట్లుసేయుము. ఏలయనిన భూసురులెదిరించినప్పుడు నేము శౌర్యముచూపరాదు.

పర—ఓయీ! రాఘవా! నేను భూసురుండననియు, నాపైశూరతఁ జూపింపరాదనియు దలంచకుము. నేనిరువదియొక్కమారు క్షత్రియకాంతారంబును ఛేదించి తద్రక్తంబుచేఁ బితృక్రియలందీర్చితి. శివునికుమారుండే నాప్రతాపంబునకోడెను. నీవనగానేపాటివి రుడవు? నీవు చిరకాలజీర్ణమైన శివచాపంబునువంచి గర్వించియున్నావు. ఏదీ! నాచేతనున్న చాపంబునువంచి నీబలమెక్కింత జూపుము?

రాము—భూసురాగ్రణీ! ఇంతయేగదా? నీయభీష్టముదీర్చెదను. నీవిల్లుటుదెమ్ము.

పర—(విల్లుఅందిచ్చును)

రాము—(అందుకొని విల్లునువంచుచున్నాడు.)

పర—ఆశ్చర్యమాశ్చర్యము. (తలవంచుకొనును.)

దశ—అబ్బా ఇప్పటికి వీనిగర్వభంగమైనది.

రాము—భూసురాగ్రణీ ఇంకను నీయభీష్టంబులెట్టివో శీఘ్రముగా దెలుపుము. తీర్చెదను.

పర—(కరంబులుమోడ్చి) మహాత్మా!

తే॥ గీ॥ నీవునావిల్లుజేపట్ట ♦ నీవువిష్ణు
మూర్తివంచునాకిప్డు ♦ బోధపడియె
యితరులైనచోదీనిని ♦ నిట్లుబట్ట
శక్తులగుదురే? మనువంశ ♦ జలధిచంద్ర.

సృష్టిస్థితి విలయకారణహేతుభూతుండును, చతుర్భుజుండునునగు శ్రీమన్నారాయణుండు నీవేయని నాకిప్పుడెలిసినది. నీదివ్యపాదారవిందసందర్శనంబుచే నాపాపంబులెల్లను నశించిపోయినవి. కావున నేను వేరుగాకోరవలసినదేమున్నది?

మ॥ దురితంబుల్ పదివేలొనర్చినను • దోడ్తో నాశమ్మారైన, భా
స్కరవంశాబ్ధిశశాంక! శశ్వదకళం • కారామ శ్రీరామ యం
చురహీన్ బేర్కొనినంత నేమిగుల • శుద్ధాత్ములై యొప్పుచుం
దురుభక్త్యోఘము భూతలంబునను సం • తోష ప్రభావాఢ్యులై.

రాము—భూసురేంద్రా! నేటితో శాంతించి క్షత్రియవధను మానుము. క్షత్రియవధచే గలిగిన పాపంబు నశించుటకై మహేంద్రగిరిని తపంబుజేసుకొనుము నీకు మోక్షప్రాప్తిగలుగును.

పర—భవదాజ్ఞ శిరసావహించుచున్నాడను.

మంగళం మహా శ్రీ శ్రీ శ్రీ.

భూతలమునన్ ప్రజలు • భూరిసుఖముల్ కనుచు
పుణ్యమతులై వెలయుగాత •
నీతముగ వర్షములు • నేలబడగా నెపుడు
నిండుఫలమీయుత పొలంబుల్
ఖ్యాతిగను రాజు నెడ • గాంచుత జనంబులతి
గౌరవము భక్తిసహితంబుల్
నేతయును ధర్మగతి • నిల్వొలగకెపుడని
నిన్ సతము నేలుత చిరకీర్తిన్.

సంపూర్ణము.